

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 29-03-2026 | సంపుటి - 27 | సంచిక -306 | రూ : 4 | పేజీలు: 8


## ఏపీ అభివృద్ధికి జర్నలిస్టులు సహకరించాలి

ఐజేయూ 11వ ప్లీనరీలో సీఎం చంద్రబాబు




2లో

- విజయవాడలో ఐజేయూ 11వ ప్లీనరీ
- పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఏపీలో మీడియాకు మాట్లాడే, ప్రశ్నించే స్వేచ్ఛ వచ్చిందని వెల్లడి




## రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై ప్రత్యేక నిఘా ఉంది

2లో

- నేటి నుంచి ఐపీఎల్ 2026 సీజన్ షురూ
- సోషల్ మీడియాలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ పోస్టు
- సోషల్ మీడియా వేదికగా సాగుతున్న బెట్టింగ్‌పై ప్రత్యేక నిఘా
- బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసే ఇన్ ఫ్లుయెన్సర్లపై కఠిన చర్యలు
- సమాచారం ఇవ్వడానికి డయల్ 100, వాట్సాప్ నంబర్ ప్రకటన

# అక్రమాలు తవ్వుతాం

- మైనింగ్ మాఫియాపై సీబీసీఐడీ విచారణ
- 2014 జూన్ 2 నుంచి ఇప్పటి వరకు చేపడతాం
- సిరిసిల్ల ఇసుక దందా మొదలు మాజీ మంత్రులు, ప్రస్తుత ఎంపీ కంపెనీల అక్రమ లీజులపై దర్యాప్తు
- ప్రతిపక్షం ఆరోపిస్తున్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై కూడా...
- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో నివేదికను ప్రవేశపెడతాం
- శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి



హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భవించిన 2014 జూన్ 2వ తేదీ నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో జరిగిన మైనింగ్ మాఫియా అక్రమాలపై సీబీసీఐడీతో విచారణ చేయిస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. సిరిసిల్ల ఇసుక దందాలో మాజీ ఎంపీ సంతోష్‌రావు, ఆయన తండ్రి రవీందర్‌రావుపై, గ్రానైట్ అక్రమ మైనింగ్‌లో మాజీ మంత్రి గంగుల కమలాకర్ కంపెనీపై, తరువాయి 2లో

## ప్రపంచంలోని ప్రతి దేశం ఇప్పుడు సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది

- ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై యుద్ధం ప్రభావం పడిందన్న ప్రధాని
- ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడిందని వెల్లడి
- ఇంతటి సంక్షోభం సమయంలోనూ అభివృద్ధి కొనసాగుతోందని ఉద్ఘాటన

ఢిల్లీ : పశ్చిమాసియాలోని ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచంలోని ప్రతి దేశం సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ప్రతి దేశం తీవ్రంగా ప్రయత్నిస్తోందని తెలిపారు. అక్కడ గత నెల రోజులుగా భీకర పోరు కొనసాగుతోందని అన్నారు. ఈ యుద్ధం కారణంగా ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడిందని అన్నారు. తరువాయి 2లో





2లో

## భారత మిగ్29 జెట్లకు ఆ క్షిపణులు అమర్చితే విధ్వంసమే!

- మిగ్29 యుద్ధ విమానాలకు ASRAAM క్షిపణులను అమర్చనున్న భారత వాయుసేన
- పాతతరం R73 క్షిపణుల స్థానంలో ఈ అత్యాధునిక క్షిపణుల మోహరింపు
- కొత్త క్షిపణుల పరిధి 25 కి.మీ పైగా ఉండటంతో గణనీయంగా పెరగనున్న పోరాట సామర్థ్యం
- క్షిపణుల సమీకరణ కోసం రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతిపాదనల జారీ

## ఉగ్రభూమిగా పాకిస్థాన్..

గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్‌లో అగ్రస్థానం



2లో

- ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదం తగ్గుముఖం పడుతుంటే పాక్‌లో మాత్రం పెరుగుదల
- 2025లో 1,139 మరణాలు, 1,045 దాడులతో పాక్‌కు అత్యంత హింసాత్మక ఏడాది



## మూసీ తీరంలో ఆధ్యాత్మిక శోభ..

2లో

రూ.700 కోట్లతో ఓంకారేశ్వర ఆలయం.. శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి

- మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా మంచిరేవులలో ఓంకారేశ్వర ఆలయ నిర్మాణం
- 8 ఎకరాల విస్తీర్ణంలో ఆలయ పనులకు సీఎం రేవంత్ శంకుస్థాపన
- మూసీ నది మధ్యలో 100 అడుగుల శివుడి విగ్రహం ఏర్పాటు.. పర్యాటక సౌకర్యాల కల్పన
- చారిత్రక ఆలయాలతో కలిపి ఈ ప్రాంతాన్ని 'చిన్న శ్రీశైలం'గా తీర్చిదిద్దే ప్రణాళిక

## హర్మూజ్ జలసంధి దాటిన రెండు భారత ఎల్పీజీ నౌకలు

- బీడబ్ల్యూ ఈఎల్ఎం, బీడబ్ల్యూ టీవైఆర్‌లు హర్మూజ్ దాటినట్లు వెల్లడి
- అంతర్జాతీయ జలాల్లోకి రెండు నౌకలు ప్రవేశించాయన్న భారత వర్గాలు
- 90,000 మెట్రిక్ టన్నులకు పైగా ఎల్పీజీ గ్యాస్ రాక

ఢిల్లీ : భారతీయ జెండాలు కలిగిన రెండు ఎల్పీజీ కంటైనర్లు బీడబ్ల్యూ ఈఎల్ఎం, బీడబ్ల్యూ టీవైఆర్‌లు హర్మూజ్ జలసంధిని దాటాయి. శుక్రవారం దుబాయ్ రస్‌అల్‌ఖైమాకు ఉత్తరాన లంగర్ వేసిన ఐదు నౌకలలో ఇవి కూడా ఉన్నాయి. ఈఎల్ఎం నౌక హెచ్‌పీసీఎల్‌ది కాగా, టీవైఆర్ నౌక బీపీసీఎల్‌కు చెందినది. భారత్ సహా మిత్రులైన ఐదు దేశాల నౌకల కోసం హర్మూజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఎల్పీజీని తీసుకువస్తున్న రెండు నౌకలు సురక్షితంగా హర్మూజ్‌ను దాటినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ రెండు నౌకల్లో 90,000 మెట్రిక్ టన్నులకు పైగా ఎల్పీజీ గ్యాస్ వస్తోంది. ఈ రెండు నౌకలు హర్మూజ్‌ను దాటి అంతర్జాతీయ తరువాయి 2లో





## ఛేజింగ్ లో కోహ్లీ క్లాస్, పడిక్కల్ మాస్...

2లో

## తొలి మ్యాచ్‌లో ఓడిన సన్ రైజర్స్

- ఐపీఎల్ 2026 సీజన్ కు అదిరిపోయే ఆరంభం
- హైదరాబాద్‌పై 6 వికెట్ల తేడాతో ఆర్సీబీ ఘన విజయం
- 202 పరుగుల భారీ లక్ష్యాన్ని 15.4 ఓవర్లలోనే ఛేదించిన బెంగళూరు

# అక్రమాలు తవ్వుతాం

హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భవించిన 2014 జూన్ 2వ తేదీ నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో జరిగిన మైనింగ్ మాఫియా అక్రమాలపై సీబీసీఐడీతో విచారణ చేయిస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. సిరిసిల్ల ఇసుక దందాలో మాజీ ఎంపీ సంతోష్‌రావు, ఆయన తండ్రి రవీందర్‌రావుపై, గ్రానైట్ అక్రమ మైనింగ్‌లో మాజీ మంత్రి గంగుల కమలాకర్ కంపెనీపై, మైనింగ్ లీజు మాఫియాలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కంపెనీపై, మాజీ మంత్రి హరీశ్‌రావు తమ్ముడు మహేశ్‌రావు మైనింగ్ దోపిడీపై.. ప్రతిపక్షం ఆరోపిస్తున్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పైనా సీబీసీఐడీతో సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. నిక్కచ్చిగా అన్ని విషయాలను నిగ్గుతేల్చి, వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో పూర్తి నివేదికను ప్రవేశపెడతామని స్పష్టం చేశారు. గనుల శాఖ పద్దులపై చర్చ సందర్భంగా శనివారం శాసనసభలో అధికార, విపక్ష సభ్యుల మధ్య చోటుచేసుకున్న వాదోపవాదాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. రాష్ట్రంలో మైనింగ్ అక్రమాలపై 'సభాసంఘం' వేయాలంటూ భారాస ఎమ్మెల్యేలు నినాదాలు చేస్తుండగానే సీఎం తన ప్రసంగాన్ని కొనసాగించారు.

**బెదిరింపులకు భయపడేది లేదు**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "రాష్ట్రంలో ఎక్కడైనా ప్రభుత్వ ఆదాయానికి నష్టం జరిగినా, ఖనిజ సంపదకు గండికొట్టే తప్పిదాలు చోటుచేసుకున్నా, మా ప్రభుత్వం ఎవరినీ ఉపేక్షించలేదు. ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన అంశంలో.. నిజానికి రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు నోటీసులిచ్చి, చర్యలు తీసుకోమన్నది మా ప్రభుత్వమే. 2025 ఆగస్టు 8న పర్యావరణ ఇంజినీర్‌కు, ఇతర అధికారులకు ఫిర్యాదు చేసి.. సీనరేజ్ కింద రూ.1,52,97,825, పర్మిట్ పన్ను కింద రూ.1,22,25,446లను ఆ సంస్థ నుంచి ప్రభుత్వమే రాబట్టింది. అయితే ఆ కంపెనీ మా మంత్రివర్గ సభ్యుడికి సంబంధించినదని ప్రతిపక్షాలు చర్చకు దిగాయి. ఇది వాళ్లు కనిపెట్టి ఫిర్యాదు చేస్తే తీసుకున్న చర్య కాదు. ఇక్కడ మంత్రుల పాత్ర ఉందని మాకెవరూ ఫిర్యాదు చేయలేదు. మా ప్రభుత్వమే వివరాలను సేకరించి, ఆ సంస్థకు నోటీసులిచ్చి, దాన్నుంచి ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను రాబట్టడమే కాకుండా.. 'దీనికి సంబంధించిన అనుమతులను పరిశీలించండి.. చర్య తీసుకోండి' అని అధికారులను ఆదేశించింది. కొందరు ప్రతిపక్ష సభ్యులు కావాలనే వివాదం లేవనెత్తి, ఒక మంత్రిపై బురద చల్లాలని చూస్తున్నారు. వాళ్ల పైరవీలకు మంత్రి సహకరించడం లేదనే అక్కసు, అసూయతోనే ఆయనపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆయన్ని బ్లాక్ మెయిల్ చేయాలని ప్రయత్నిస్తున్నారు. వారి బెదిరింపులకు ఈ ప్రభుత్వం భయపడదు. నిజంగా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో మా మంత్రికి ప్రత్యక్షంగా సంబంధముంటే.. నోటీసులిచ్చి, పన్నుల వసూలు వంటి చర్యలను రాష్ట్ర ప్రభుత్వమే తీసుకుంటుందా? అసలు ఇలాంటి ప్రయత్నం ఏ ప్రభుత్వమైనా చేస్తుందా? భారాస హయాంలో ఎప్పుడైనా ఇలా చేశారా..." అంటూ నిలదీశారు.

## ఛేజింగ్ లో కోహ్లీ క్లాస్, పడిక్కల్ మాస్... తొలి మ్యాచ్‌లో ఓడిన సన్ రైజర్స్

ఐపీఎల్ 2026 సీజన్ అట్టహాసంగా ప్రారంభమైంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగిన ఉత్కంఠభరితమైన తొలి మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అద్భుత విజయాన్ని నమోదు చేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్దేశించిన 202 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం 15.4 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించి, టోర్నీలో శుభారంభం చేసింది. విరాట్ కోహ్లీ అజేయ అర్ధశతకంతో పాటు దేవదత్ పడిక్కల్, రజత్ పటీదార్‌ల విధ్వంసకర బ్యాటింగ్ ముందు సన్‌రైజర్స్ బౌలర్లు తేలిపోయారు. భారీ లక్ష్య ఛేదనలో ఆర్సీబీకి ఆరంభంలోనే ఓపెనర్ ఫిల్ సాల్ట్ (8) రూపంలో ఎదురుదెబ్బ తగిలింది. అయితే, ఆ తర్వాత విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్ సృష్టించిన విధ్వంసం మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసింది. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు కేవలం 45 బంతుల్లోనే 101 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ముఖ్యంగా పడిక్కల్ (26 బంతుల్లో 61; 7 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరుపు వేగంతో పరుగులు సాధించి సన్‌రైజర్స్ బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. పడిక్కల్ ఔటయ్యాక వచ్చిన కెప్టెన్ రజత్ పటీదార్ (12 బంతుల్లో 31; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) తన వంతు మెరుపులు మెరిపించి విజయాన్ని మరింత చేరువ చేశాడు. ఒకే ఓవర్లో పటీదార్, జితేష్ శర్మ (0) ఔటైనా, మరో ఎండ్‌లో విరాట్ కోహ్లీ (38 బంతుల్లో 69 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్సర్లు) చివరి వరకు నిలిచి టిమ్ డేవిడ్ (16 నాటౌట్) తో కలిసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. సన్‌రైజర్స్ బౌలర్లలో డేవిడ్ పేన్ రెండు వికెట్లు తీసినప్పటికీ, మిగతా వారెవరూ భారీ పరుగుల ప్రవాహాన్ని అడ్డుకోలేకపోయారు. ఈ విజయంతో ఆర్సీబీ పాయింట్ల పట్టికలో ఖాతా తెరిచింది. అంతకుముందు, టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 201 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆ జట్టుకు ఆరంభంలోనే ట్రావిస్ హెడ్ (11), అభిషేక్ శర్మ (7) వికెట్లను త్వరగా కోల్పోవడంతో 29 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట సమయంలో కెప్టెన్ ఇషాన్ కిషన్ (38 బంతుల్లో 80; 8 ఫోర్లు, 5 సిక్సర్లు) అద్భుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. హెన్రిచ్ క్లాసెన్ (31) తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. ఇషాన్ ఔటైన తర్వాత, చివర్లో యువ ఆటగాడు అనికేత్ వర్మ (18 బంతుల్లో 43; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో హైదరాబాద్ 200 పరుగుల మార్కును దాటగలిగింది. ఆర్సీబీ బౌలర్లలో జాకబ్ డఫీ అత్యంత పొదుపుగా బౌలింగ్ చేసి కేవలం 22 పరుగులిచ్చి 3 వికెట్లతో సత్తా చాటాడు. రొమారియో షెపర్డ్ 54 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు.

## ఏపీ అభివృద్ధికి జర్నలిస్టులు సహకరించాలి

రాష్ట్ర అభివృద్ధిలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలని, తమ ప్రభుత్వం మీడియా స్వేచ్ఛకు పూర్తి భరోసా కల్పిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గత ఐదేళ్ల పాలనలో మీడియా తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొందని, కనీసం మాట్లాడే స్వేచ్ఛ కూడా లేని దుస్థితి ఉండేదని గుర్తుచేశారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో మీడియాకు తిరిగి ప్రశ్నించే గొంతుక వచ్చిందన్నారు. శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) 11వ ప్లీనరీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తమది జర్నలిస్ట్ ఫ్రెండ్లీ ప్రభుత్వమని, వారి సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

**రాష్ట్రంలో మీడియాకు స్వేచ్ఛ వచ్చింది**

గత ప్రభుత్వ హయాంలో మీడియా ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, "గత ఐదేళ్లలో క్రిమినల్స్ రాజకీయాల్లోకి వస్తే ఏం జరుగుతుందో రాష్ట్ర ప్రజలు చూశారు. తమ తప్పులను ఎత్తిచూపే మీడియాను నియంత్రించేందుకు జీవో నెం. 2430 వంటివి తీసుకొచ్చారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మూడు రాజధానులంటూ రాష్ట్రాన్ని గందరగోళంలో పడేశారు. ఆనాడు జర్నలిస్టులకు మాట్లాడే స్వేచ్ఛ కూడా లేదు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. మా ప్రభుత్వం మీడియా స్వేచ్ఛను గౌరవిస్తుంది. ప్రశ్నించే హక్కును కల్పిస్తుంది," అని చంద్రబాబు అన్నారు.

*** విలువలు పడిపోతున్నాయి..**

**రాజకీయ పార్టీలకు మీడియా ప్రమాదకరం**

ప్రస్తుత జర్నలిజంలో విలువలు పడిపోవడంపై చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. "రాజకీయ పార్టీలే సొంతంగా మీడియా సంస్థలను నడపడం సమాజానికి అత్యంత ప్రమాదకరం. వారు తమ స్వప్రయోజనాల కోసం అబద్ధాలను సైతం నిజాలుగా చిత్రీకరిస్తున్నారు. దీనికి నా జీవితమే ఒక ఉదాహరణ. 2019లో వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగితే, మొదట గుండెపోటు అని ప్రచారం చేసి, ఆ తర్వాత ఆ నెపాన్ని నాపై మోపారు. 'నారాసుర రక్త చరిత్ర' అంటూ నా చేతిలో కత్తి పెట్టి ఓ పత్రికలో తప్పుడు వార్త రాశారు. ఇది వ్యక్తిత్వ హననం కాదా? సోషల్ మీడియాలో ఇలాంటి తప్పుడు ప్రచారాన్ని నియంత్రించేందుకు జర్నలిస్టులు కృషి చేయాలి," అని ఆయన సూచించారు.

**ప్రోగ్రెసివ్ వార్తలు ఇవ్వండి**

రాష్ట్ర పునర్నిర్మాణంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. "నేను మిమ్మల్ని పాజిటివ్ వార్తలు ఇవ్వమని కోరడం లేదు. ప్రోగ్రెసివ్ వార్తలు ఇవ్వాలని కోరుతున్నా. రాష్ట్రంలో మంచిని, శాంతిని, అభివృద్ధిని ప్రోత్సహించండి. రాష్ట్ర విభజన వల్ల జరిగిన నష్టం కంటే 201924 మధ్య కాలంలోనే ఏపీకి ఎక్కువ నష్టం జరిగింది. ఇప్పుడు మేం రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెడుతున్నాం. అమరావతిని రాజధానిగా నిర్ధారిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశాం. రాబోయే ఐదేళ్లలో అమరావతిలో అద్భుతమైన అభివృద్ధిని చూస్తారు. ఈ అభివృద్ధిని ప్రపంచానికి తెలియజేయాల్సిన బాధ్యత మీడియాపై ఉంది," అని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. "ఉమ్మడి రాష్ట్రంలో మండల స్థాయి రిపోర్టర్లకు అక్రిడేషన్లు ఇచ్చింది తెలుగుదేశం ప్రభుత్వమే. జర్నలిస్టుల కోసం వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేశాం. వారిపై దాడులు జరిగితే ఎస్పీ స్థాయి అధికారి విచారించేలా నిబంధనలు పెట్టాం. 2014-19 మధ్య డెస్క్ జర్నలిస్టులకు కూడా అక్రిడేషన్లు, బస్సు పాసుల్లో రాయితీలు, రూ.10 లక్షల ప్రమాద బీమా కల్పించాం. గత ప్రభుత్వం వాటిని తొలగించింది. మేము 2018లో 20 వేల అక్రిడేషన్లు ఇస్తే, వారు సగానికి తగ్గించారు. ఇప్పుడు అర్హులైన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడేషన్ అందిస్తాం" అని స్పష్టం చేశారు.

**స్థలాల కేటాయింపుపై హామీ**

గతంలో హైదరాబాద్‌లో మంత్రుల క్వార్టర్ల స్థలాన్ని ప్రెస్ క్లబ్ కోసం కేటాయించిన విషయాన్ని చంద్రబాబు గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో అమరావతిలో ఐజేయూ కార్యాలయానికి స్థలం కేటాయించే అంశాన్ని పరిశీలించేందుకు ఒక సబ్ కమిటీకి అప్పగిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు, సమావేశానికి విచ్చేసిన

## ఉగ్రభూమిగా పాకిస్థాన్.. గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్‌లో అగ్రస్థానం

ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదం తగ్గుముఖం పడుతున్నప్పటికీ, పాకిస్థాన్ మాత్రం దానికి పూర్తి భిన్నమైన దిశలో పయనిస్తోంది. గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ (జీటీఐ) 2026 ప్రకారం, ఉగ్రవాదం వల్ల అత్యంత ఎక్కువగా ప్రభావితమైన దేశంగా పాకిస్థాన్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ నివేదికలోని గణాంకాలు పాకిస్థాన్ ఎదుర్కొంటున్న తీవ్రమైన అంతర్గత సవాళ్లను, దశాబ్దాలుగా అనుసరిస్తున్న విధానాల వైఫల్యాలను స్పష్టంగా ఎత్తిచూపుతున్నాయి. గ్రీక్ సిటీ టైమ్స్ తన కథనంలో వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ సూచీలో పాకిస్థాన్ ఉగ్రవాదానికి కేంద్ర బిందువుగా నిలిచింది. 2025 సంవత్సరంలోనే దేశంలో 1,045 ఉగ్రదాడులు జరిగాయని, వాటిలో 1,139 మంది ప్రాణాలు కోల్పోయారని నివేదిక వివరించింది. మరో 1,595 మంది గాయపడగా, 655 మందిని ఉగ్రవాదులు బందీలుగా పట్టుకున్నారు. ఇండెక్స్‌లో 8.574 స్కోరుతో పాకిస్థాన్ అన్ని దేశాల కంటే ముందుంది. 2013 తర్వాత పాకిస్థాన్‌కు ఇదే అత్యంత హింసాత్మక సంవత్సరమని నివేదిక పేర్కొంది. ప్రపంచమంతటా ఉగ్రవాదం తగ్గుతుంటే, పాక్‌లో ఈ స్థాయి పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది. పాకిస్థాన్‌లో జరుగుతున్న హింస భౌగోళికంగా కొన్ని ప్రాంతాలకే పరిమితమైందని నివేదిక గుర్తించింది. ముఖ్యంగా ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్ ప్రావిన్సులలోనే 2025లో మొత్తం దాడుల్లో 74 శాతం, మరణాల్లో 67 శాతం నమోదయ్యాయి. ఈ ప్రాంతాలు నిరంతర అస్థిరత, బలహీనమైన ప్రభుత్వ నియంత్రణతో ఉగ్ర కార్యకలాపాలకు కేంద్రాలుగా మారాయని నివేదిక తెలిపింది. ఆఫ్ఘనిస్థాన్‌పాకిస్థాన్ సరిహద్దు వెంబడి దశాబ్దాలుగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉదాసీన వైఖరే ఇందుకు కారణమని విశ్లేషించింది. పాకిస్థాన్‌లోని గిరిజన ప్రాంతాలు చాలా కాలంగా పాక్షిక పాలనలో ఉండటం వల్ల అల్‌ఖైదా, హక్కానీ నెట్‌వర్క్, స్థానిక ఉగ్ర సంస్థలకు సురక్షిత స్వర్గధామంగా మారాయని నివేదిక వెల్లడించింది. డ్యూరాండ్ లైన్‌కు ఇరువైపులా ఉన్న జాతి, సామాజిక బంధాలు సరిహద్దులు దాటి ఉగ్రవాదుల కదలికలకు మరింత ఆస్కారం కల్పిస్తున్నాయని పేర్కొంది. గతంలో తీసుకున్న విధానపరమైన నిర్ణయాలు, నిర్మాణ లోపాల సంచిత ప్రభావమే పాకిస్థాన్ ప్రస్తుత దుస్థితికి కారణమని గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ తేల్చి చెప్పింది. కొన్ని ప్రాంతాలలో దాడులు కేంద్రీకృతం కావడం, నిర్దిష్ట గ్రూపుల ప్రాబల్యం పెరగడం వంటివి పాక్ వ్యవస్థపై తీవ్రమైన ఒత్తిడిని సూచిస్తున్నాయి.

## భారత మిగ్29 జెట్లకు ఆ క్షిపణులు అమర్చితే విధ్వంసమే!

భారత వాయుసేన తన అమ్ములపొదిలో ఉన్న మిగ్29 యుద్ధ విమానాలను మరింత పదును తేల్చనుంది. ఈ ఫైటర్ జెట్లను అత్యాధునిక 'అడ్వాన్స్‌డ్ షార్ట్ రేంజ్ ఎయిర్‌టు ఎయిర్ మిస్సైల్' క్షిపణులతో అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించింది. ఈ ఆధునికీకరణతో విమానాల గగనతల పోరాట సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. శత్రు విమానాలను దూరంలోనే గుర్తించి ధ్వంసం చేయడంలో ఈ క్షిపణులు కీలకం కానున్నాయి. ఈ మేరకు రక్షణ మంత్రిత్వ శాఖ మార్చి 25న ఓ కీలక ముందడుగు వేసింది. మిగ్29 UPG వేరియంట్ విమానాలకు ASRAAM క్షిపణులను అనుసంధానం చేయడం, పరీక్షించడం కోసం 'రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్' (RFP) జారీ చేసింది. ఈ ఒప్పందం కేవలం క్షిపణులకే పరిమితం కాదు. వాటికి అవసరమైన లాంచర్లు, ఇతర పరికరాలతో పాటు పైలట్లకు, గ్రౌండ్ సిబ్బందికి శిక్షణ కూడా ఇందులో భాగం. ప్రస్తుతం మిగ్29 విమానాల్లో సోవియట్ కాలం నాటి R73 క్షిపణులను వాడుతున్నారు. వాటి పరిధి కేవలం 10-15 కిలోమీటర్లు మాత్రమే. అయితే, కొత్తగా అమర్చనున్న ASRAAM క్షిపణుల పరిధి 25 కిలోమీటర్లకు పైగా ఉండటం గమనార్హం. యూరోపియన్ బహుళజాతి సంస్థ MBDA తయారు చేసిన ఈ ASRAAM క్షిపణులు అత్యంత అధునాతనమైనవి. ఇవి 'ఫైర్ అండ్ ఫర్గెట్' (ప్రయోగించాక దానంతట అదే లక్ష్యాన్ని ఛేదిస్తుంది) టెక్నాలజీతో పనిచేస్తాయి. ఉష్ణాన్ని గుర్తించి లక్ష్యం వైపు దూసుకెళ్లే (హీట్‌సీకింగ్) సామర్థ్యం, గంటకు మాక్ 3 (ధ్వని కంటే మూడు రెట్ల వేగం) కంటే ఎక్కువ వేగంతో ప్రయాణించడం వీటి ప్రత్యేకత. ఇప్పటికే స్వదేశీ తేజస్, జాగ్వార్ యుద్ధ విమానాలకు ఈ క్షిపణులను విజయవంతంగా అనుసంధానించారు. భారత వాయుసేన వద్ద ప్రస్తుతం 55కు పైగా మిగ్29 విమానాలు సేవలందిస్తున్నాయి. వీటిలో పాత R73 క్షిపణుల స్థానంలో పూర్తిగా ASRAAMలను మోహరించనున్నారు. కేవలం మిగ్29లే కాకుండా, వాయుసేనలోని అన్ని రకాల ఫైటర్ జెట్లలో R73లను తొలగించి, వాటి స్థానంలో ASRAAMలను అమర్చాలనేది IAF వ్యూహాత్మక ప్రణాళిక. 2021లో MBDA, భారత ప్రభుత్వ రంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (BDL) మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం... హైదరాబాద్‌లో ఈ క్షిపణులను స్థానికంగా అసెంబుల్ చేసేందుకు, పరీక్షించేందుకు ఒక కేంద్రం నిర్మాణం జరుగుతోంది. పొరుగు దేశాల నుంచి ఎదురవుతున్న సవాళ్ల నేపథ్యంలో ఈ అప్‌గ్రేడ్ వ్యూహాత్మకంగా ఎంతో కీలకం. చైనా తన J10C, J20 వంటి విమానాల్లో PL 10 క్షిపణిని ఉపయోగిస్తుండగా, పాకిస్థాన్ తన JF17 ఫైటర్ జెట్లలో PL10E వెర్షన్‌ను వాడుతోంది. అయితే, ASRAAM క్షిపణిలో పెద్ద రాకెట్ మోటార్ ఉండటం వల్ల దాని పరిధి, పనితీరు చైనా క్షిపణి కంటే మెరుగ్గా ఉంటుందని రక్షణ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ అప్‌గ్రేడ్ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ, మిగ్ 29 విమానాలు భారత గగనతల రక్షణలో కీలక పాత్ర పోషిస్తూనే ఉన్నాయి.

## హర్మూజ్ జలసంధి దాటిన రెండు భారత ఎల్పీజీ నౌకలు

(మొదటిపేజీ తరువాయి)

ఎల్పీజీని తీసుకువస్తున్న రెండు నౌకలు సురక్షితంగా హర్మూజ్‌ను దాటినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ రెండు నౌకల్లో 90,000 మెట్రిక్ టన్నులకు పైగా ఎల్పీజీ గ్యాస్ వస్తోంది. ఈ రెండు నౌకలు హర్మూజ్‌ను దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మరికొన్ని భారతీయ ట్యాంకర్లు యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ సమీపంలోని జలాల్లో ఇరాన్ అనుమతి కోసం వేచి చూస్తున్నాయి. కాగా, 47,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ గ్యాస్‌తో కూడిన జగ్ వసంత్ ట్యాంకర్ నౌక గుజరాత్‌లోని వదినార్ పోర్టుకు చేరుకుంది.

## రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై ప్రత్యేక నిఘా ఉంది

హైదరాబాద్ : నేడు ఐపీఎల్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు బెట్టింగ్ రాయుళ్లకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. క్రికెట్‌ను కేవలం ఆటలాగే ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. బెట్టింగ్‌పై పూర్తిస్థాయిలో నిఘా పెట్టామని, ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. గతంలో వందలాది బెట్టింగ్ యాప్‌లను నిషేధించినప్పటికీ, నిర్వాహకులు కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారని సజ్జనార్ తెలిపారు. ముఖ్యంగా టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికలుగా ఈ దందా కొనసాగుతోందని ఆయన వివరించారు. కేవలం డబ్బు కోసం ఇలాంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. న్‌లైన్‌లోనే కాకుండా ఫామ్ హౌస్‌లు, రహస్య ప్రదేశాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌పైనా ప్రత్యేక దృష్టి సారించామని కమిషనర్ పేర్కొన్నారు. బెట్టింగ్ కారణంగా అప్పులపాలై కుటుంబాలు వీధిన పడే పరిస్థితులు తెచ్చుకోవద్దని ఆయన సూచించారు. తమ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే, వెంటనే డయల్ 100కు గానీ, 94906 16555 వాట్సాప్ నంబర్‌కు గానీ సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

## ప్రపంచంలోని ప్రతి దేశం ఇప్పుడు సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది

పశ్చిమాసియాలోని ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచంలోని ప్రతి దేశం సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ప్రతి దేశం తీవ్రంగా ప్రయత్నిస్తోందని తెలిపారు. అక్కడ గత నెల రోజులుగా భీకర పోరు కొనసాగుతోందని అన్నారు. ఈ యుద్ధం కారణంగా ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడిందని అన్నారు. ప్రపంచమంతా ఎదుర్కొంటున్న ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని అన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల నుంచి మన దేశాన్ని రక్షించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.

## మూసీ తీరంలో ఆధ్యాత్మిక శోభ.. రూ.700 కోట్లతో ఓంకారేశ్వర ఆలయం..

హైదరాబాద్ :తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో మరో కీలక ముందడుగు పడింది. హైదరాబాద్ శివార్లలోని గండిపేట మండలం మంచిరేవుల వద్ద రూ.700 కోట్ల భారీ వ్యయంతో నిర్మించనున్న ఓంకారేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులకు సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ శంకుస్థాపన చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఆయన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. మూసీ తీరాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మార్చే లక్ష్యంలో భాగంగా 8 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆలయాన్ని నిర్మించనున్నారు. శృంగేరి శారదాపీఠం జగద్గురువుల సూచనల మేరకు ఈ ఆలయ డిజైన్‌ను ఖరారు చేశారు. ఆలయ ప్రవేశంలో 100 అడుగుల ఎత్తైన రాజగోపురం, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రత్యేక మండపాలు నిర్మిస్తారు. 207 అడుగుల పొడవైన మహామండపం, దానిని ఆనుకుని ఓంకారేశ్వర మందిరం కొలువుదీరనుంది. యాదగిరిగుట్ట తర్వాత రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద గర్భాలయంగా ఇది నిలవనుంది. రామప్ప, యాదగిరిగుట్ట నిర్మాణాల్లో వాడిన నాణ్యమైన కృష్ణశిలతోనే ఈ ఆలయాన్ని కూడా నిర్మించనుండటం విశేషం. ఈ ప్రాజెక్టులో భాగంగా మూసీ నది మధ్యలో 100 అడుగుల భారీ శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. నదిపై చెక్‌డ్యామ్ నిర్మించి బోటింగ్ వంటి పర్యాటక సౌకర్యాలను కల్పించనున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం 2,000 వాహనాలకు సరిపడా పార్కింగ్ వసతి, ఔటర్ రింగ్ రోడ్డు నుంచి నేరుగా కనెక్టివిటీ కల్పిస్తారు. సమీపంలోని శతాబ్దాల చరిత్ర కలిగిన వీరభద్రస్వామి ఆలయం ఉన్న గుట్టపైకి వెళ్లేందుకు అత్యాధునిక తీగల వంతెనను నిర్మించనున్నారు.

# సీఎం సహాయ నిధి పేదలకు వరం..

*** కాంగ్రెస్ నేత ముబారక్ అలీ ఖాన్**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరమని కాంగ్రెస్ సీనియర్ నేత ముబారక్ అలీ ఖాన్ అన్నారు. పట్టణంలోని 13వ వార్డు లో అనారోగ్యంతో బాధపడుతున్న బొర్ర నవీన్ కుటుంబానికి రూ. 60 వేల సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం పట్ల అంకితభావంతో పని చేస్తున్నారని తెలిపారు. ఎవరికి అనారోగ్య పరిస్థితులు ఉన్నప్పటికీ ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందన్నారు.

# యువకుడి ప్రాణాలు కాపాడిన మత్స్యశాఖ సిబ్బంది



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: శ్రీ రామనవమి సందర్భంగా భద్రాచలంలో నిర్వహించిన పట్టాభిషేకం మహోత్సవానికి హైదరాబాద్ నుంచి వచ్చిన ఉదయ్ అనే వ్యక్తి శనివారం గోదావరి నదిలో స్నానం చేసేందుకు వచ్చి ప్రమాదవశాత్తు నదిలో పడిపోయాడు. అక్కడే విధుల్లో ఉన్న మత్స్యశాఖ సిబ్బంది గోదావరిలో కొట్టుకుపోతున్న ఉదయ్‌ను రక్షించి అంబులెన్స్‌లో ఆస్పత్రికి పంపించారు. ఉదయ్ ప్రాణాలు కాపాడిన గజ ఈతగాడు కరకు ప్రసాద్, మత్స్యశాఖ అధికారి ఎం.డి.ఇంతియాజ్, అహ్మద్ ఖాన్‌లను స్థానికులు అభినందించారు.

# వీర్లపల్లిలో విద్యుత్ కష్టాలకు చెల్లు..

*** ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో 100 కేవి ట్రాన్స్ ఫార్మర్లు**




ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : ఎమ్మెల్యే స్వగ్రామమైన వీర్లపల్లి లో విద్యుత్ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది.. స్వయంగా ఆయన చొరవ తీసుకోవడంతో సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామంలో లో వోల్టేజ్ సమస్యలు ఉండడానికి దీనిని పరిష్కరించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేయడంతో స్పందించిన ఎమ్మెల్యే వీడ్లపల్లి శంకర్ మూడు కొత్త 100కె.వి ట్రాన్స్ ఫార్మర్లు, జంక్షన్ నుంచి వీర్లపల్లి గ్రామానికి నేరుగా 40 స్తంభాలతో ప్రత్యేక లైను, పాత స్తంభాల స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. దీనివల్ల గ్రామంలో 24 గంటలు విద్యుత్ అందుబాటులో ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. అభివృద్ధి పథంలో వీర్లపల్లి గ్రామాన్ని ముందుకు తీసుకు వెళుతున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పెద్దలు చంద్రశేఖర్ గౌడ్, నవాజ్ రెడ్డి, చిందం నరసింహులు, ప్రభాకర్ రెడ్డి, చాకలి నరసింహ, ఎండి హైమాద్, దుబ్బ లక్ష్మయ్య, చాకలి శ్రీశైలం, కల్వకోలు రాఘవేంద్ర, చాకలి శ్రీనివాస్, పాలకొండ శ్రవణ్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు

# భక్తి శ్రద్ధలతో గీతా యజ్ఞం



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : శ్రీరామనవమి సందర్భంగా అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించిన అనంతరం ఆనవాయితీగా వస్తున్న గీతా యజ్ఞాన్ని శనివారం స్థానిక బీట్ మార్కెట్లోని శ్రీ వాసవి మాత శ్రీ ఉమామహేశ్వర స్వామి సహిత శ్రీరామ కోటి స్థూప దేవాలయంలో భక్తి శ్రద్ధలతో వేదమంత్రోచరణాల నడుమ శాస్త్రోప్తంగా గీతా యజ్ఞం నిర్వహించారు, మహిళా భక్తుల శ్రీరామనమ పారాయణం మధ్యన యజ్ఞాన్ని వేదమూర్తులు నిర్వహించారు. అనంతరం శ్రీ రామ కోటి పుస్తక పూజ నిక్షిప్తం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి, అనంతరం అన్నదాన వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఓరుగంట పరమేష్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ధర్మకర్తలు గజ్జల వెంకటేశ్వర్లు కుక్కడపు శ్రీనివాసు ప్రోగ్రాం కన్వీనర్ మేడం విశ్వ ప్రసాద్ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో రేపాల భద్రాద్రి, మిట్టపల్లి గోవర్ధన్ గుండా రమేష్ బాబు , శివకోటి నెహ్రూ కర్నాటి నగేష్, వాత్సవ్, మురారి శెట్టి శంకర్ బండారు సురేష్ , వనం గోపికృష్ణ, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ముగిసిన శ్రీరామనవమి వేడుకలు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరామ నవ వేడుకలు శనివారం ముగిశాయి. శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శ్రీ శ్రీ సీతారామచంద్ర స్వామి, లక్ష్మణ, హనుమంతుల ఉత్సవ మూర్తులకు చక్రస్నానం చేయించారు. అనంతరం గర్భగుడిలోకి ఉత్సవ విగ్రహాలను ప్రవేశింపజేశారు. ఈ కార్యక్రమంతో శ్రీరామనవమి ఉత్సవం ముగింపు జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి, ధర్మకర్తలు కామిశెట్టి చంద్రశేఖర్, గుర్రం వెంకటేశం, వర్కాల వెన్నెల రవి గౌడ్, తూర్పాటి నర్సింహ, గుజ్జుల సురేందర్ రెడ్డి, సామిడి రాఘవరెడ్డి, బొడిగె బాలకృష్ణ, మునుకుంట్ల సత్యనారాయణ గౌడ్, ఊడుగు మల్లేష్ గౌడ్, కాసుల వెంకటేష్ గౌడ్, గుజ్జుల రవీందర్ రెడ్డి నల్ల చంద్రశేఖర్, వేద పండితులు పెద్ది కిషోర్ శర్మ, రోహిత్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

# వినాయకనగర్‌లో అంబరాన్నంటిన శ్రీరామనవమి సంబరాలు



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని వినాయకనగర్‌లో శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీరామ యువసేన ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం భక్తుల జయజయధ్వానాల మధ్య ఘనంగా కొనసాగింది.ఈ సందర్భంగా పండితులచే వేదమంత్రోచ్చారణల నడుమ సీతారాముల కళ్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భజనలు, శ్రీరామ నామస్మరణలతో వినాయకనగర్ ప్రాంతం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.ఈ దివ్య కార్యక్రమాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమ నిర్వహణలో శ్రీరామ యువసేన సభ్యులు క్రమశిక్షణతో సేవలు అందిస్తూ, స్థానిక ప్రజల ప్రశంసలు అందుకున్నారు. వినాయక నగర్ వీధుల్లో జానకీరాముల నామస్మరణలు మారుమ్రోగుతూ భక్తి పరవశాన్ని నింపాయి.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కళ్లెపు సంతోష్ గౌడ్, వల్లభ బిల్లు యాదవ్, గట్టు వినయ్ గౌడ్, కళ్లెపు సాయి ప్రసాద్ గౌడ్, చిన్నోజు అనిల్ చారి, సుంకోజు తరుణ్ తేజ్, రాహుల్, ఓరుగంటి మహేష్, తాత మల్లేష్, మెడబోయిన సాయికుమార్ ముదిరాజ్, కర్రి శివకుమార్, రతన్ రాథోడ్, కేతావత్ సాయి చరణ్, బండిరాల సాయిరాం, అలీ శ్రీనాథ్, సైబు చెన్నయ్య, దయాల నందు, గణేష్ గౌడ్, అరుణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఐ.పీ.ఎల్ బెట్టింగ్ రాయుళ్లపై డేగ కన్ను

*** బెట్టింగ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు**

*** ముస్తాబాద్ ఎస్ ఐ సిహెచ్ గణేష్**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఐపీఎల్ బెట్టింగ్ రాయుళ్లపై డేగ కన్ను వేసినట్లు ఎస్.ఐ సిహెచ్.గణేష్ హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 శనివారం నుండి ఐ.పీ.ఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమైన నేపథ్యంలో బెట్టింగ్ నిర్వాహకులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువత, విద్యార్థులు జూదానికి అలవాటు పడి లక్షలాది రూపాయలు పోగొట్టుకోవద్దని, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా గానీ, రహస్యంగా స్థావరాలు ఏర్పాటు చేసి గానీ బెట్టింగ్ నిర్వహిస్తే కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఐపీఎల్ సీజన్‌లో అమాయక యువకులను ఆకర్షించే బుకీల పని పడతామని, పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచామని వెల్లడించారు.తల్లిదండ్రులు తమ పిల్లలు సెల్ ఫోన్లో లో ఏయే యాప్‌లు వాడుతున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు అనే అంశాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. బెట్టింగ్ వల్ల అప్పుల పాలై కుటుంబాలు వీధిన పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే 100 నెంబర్‌కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని, వివరాలు తెలిపిన వారి పేర్లను అత్యంత రహస్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో గస్తీ ముమ్మరం చేశామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని గణేష్ హెచ్చరించారు. క్రికెట్‌ను కేవలం క్రీడగా మాత్రమే చూడాలని, జూదంగా మార్చి జీవితాలను పాడుచేసుకోవద్దని హితవు పలికారు. బెట్టింగ్ నిర్వహించే వారు ఎంతటి వారైనా వదిలేది లేదని హెచ్చరించారు.

## పదవ తరగతి పరీక్ష కేంద్రం,

# అంగన్వాడి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ

*** జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: శనివారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్, చిన్న గూడూరు మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షల సరళిని పరిశీలించారు. మార్చి 14 తేదీ నుండి జిల్లాలోని (45) పరీక్షా కేంద్రాల ద్వారా (8157) మంది విద్యార్థిని, విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, పరీక్షల నిర్వహణ కోసం ప్రభుత్వ సూచనల ప్రకారం ఫ్లయింగ్ స్క్వాడ్స్ (3) సిట్టింగ్ స్క్వాడ్స్ ప్రతీ కేంద్రానికి ఒక్కటి, సుమారు (528) పరీక్షల నిర్వహణ సిబ్బంది, (45) వైద్య బృందాల సిబ్బంది, అదనపు కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులు, నిత్య పర్యవేక్షణలో ఏలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు కొనసాగడం జరుగుతుందన్నారు,చీఫ్ సూపరిండెంట్లు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రశ్నపత్రాల ఓపెనింగ్, క్లోజింగ్ ప్రక్రియ, విద్యాశాఖ ప్రధాన కార్యాలయం నుండి వైర్లెస్ సెట్ ద్వారా పర్యవేక్షణ సూచనలు జారీ చేస్తున్నారని, ఈరోజు డీఈవో వి.రాజేశ్వర్, డోర్నకల్, కురవి (6) ఏజిసి మందుల శ్రీరాములు మహబూబాబాద్, గార్ల, బయ్యారం, 6 కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ (18) కేంద్రాలలో జరుగుతున్న పరీక్షల సరళని తనిఖీ చేశారనీ, శనివారం (8165) మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై 99.89 శాతం నమోదు అయ్యిందని తెలిపారు, ఏప్రిల్ 16 వరకు జరిగే పరీక్షల నిర్వహణలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో నిమగ్నమై ఉందని తెలిపారు. అనంతరం అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి, రికార్డులను హాజరు, వివరాలను, స్టాకును తనిఖీ చేశారు,పిల్లలకు పౌష్టిక ఆహారం అందిస్తూ వారికి అర్థమయ్యే విధంగా విద్యను అందించాలని సూచించారు, అంగన్వాడి కేంద్రం పరిధిలో ఉన్న శ్యామ్, మ్యామ్, పిల్లలను గమనిస్తూ ఉండాలని,బాలింతలకు, గర్భిణీలకు, చిన్నపిల్లలకు, బలవర్ధకమైన పౌష్టిక ఆహారం అందించాలని సూచించారు. అంగన్వాడీ టీచర్లు, పిల్లల హాజరు శాతం పూర్తిస్థాయిలో ఉండాలన్నారు,అన్ని విద్యాసంస్థలలో హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్ లపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు,ఈ పర్యటనలో సంబంధిత అధికారులు ఉన్నారు.

# ఏప్రిల్ 19న పూలే–అంబేద్కర్ జన జాతరను జయప్రదం చేయండి

*** సన్నాహక సమావేశంలో వక్తల పిలుపు**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : మహాత్మ జ్యోతిబాపూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతుల సందర్భంగా నిర్వహించనున్న కులరహిత సమానత్వ సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 19న నల్గొండ లో జరిగే పూలే-అంబేద్కర్ జన జాతరను విజయవంతం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు.శనివారంఎంవీన్ ట్రస్ట్ భవనంలో జరిగిన సన్నాహక సమావేశం జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను అధ్యక్షతన జరిగిన సమావేశంలో అడ్వకేట్ దర్శనం నరసింహ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నేలపట్ల సత్యనారాయణ లు మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయినప్పటికీ సమాజంలో కుల వివక్షత ఇంకా కొనసాగుతుండటం బాధాకరమని పేర్కొన్నారు. బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించకపోవడం వల్ల వారి హక్కులు హరించబడుతున్నాయని, అభివృద్ధి అడ్డంకులు ఎదురవుతున్నాయని అన్నారు. ఏప్రిల్ 19న నల్లగొండ పట్టణంలోని టీఎన్జీవో భవనంలో జరిగే పూలే-అంబేద్కర్ జన జాతరను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ సన్నాహకా సమావేశంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నారీ ఐలయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బండ శ్రీశైలం ,ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి ,మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అద్దంకి రవీందర్, రేఖల సైదులు, ఆవాజ్, జిల్లా కార్యదర్శి సయ్యద్ హాశం వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ గంజి మురళీధర్ సిఐటియు జిల్లా కార్యదర్శి మహమ్మద్ సలీం గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చౌగోని సీతారాములు ఎం వి ఎన్ ట్రస్టు భవన్ కన్వీనర్ పుచ్చకాయల నర్సిరెడ్డి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ ఎస్సీ సంక్షేమ సంఘం జాతీయ కౌన్సిల్ సభ్యులు రాయల సీతారాములు ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్ ఐద్వారాష్ట్ర కమిటీ సభ్యురాలు కొండ అనురాధ గీతా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండా వెంకన్న మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బిక్షమయ్య ప్రముఖ కవి రచయిత బండారు శంకర్ ప్రముఖ కవి అడ్వకేట్ మోత్కూరి శ్రీనివాస్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కుమ్మరి శంకర్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఔటా రవీందర్ కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు రెమిడాల పరుష రాములు జిల్లా ఆఫీసు బేరర్స్ గాదె నరసింహ కోడి రెక్క మల్లయ్య ఒంటపాక కృష్ణ బొల్లు రవీందర్ కుమార్ జిల్లా కమిటీ సభ్యులు దంతాల నాగార్జున దోరేపల్లి మల్లయ్య బొంగరాల వెంకన్న నల్ల రామస్వామి తదితరులు పాల్గొన్నారు

# నియోజకవర్గాల పునర్విభజనతో ఒత్తిడిలో రేవంత్‌రెడ్డి

**: బండి సంజయ్**

హైదరాబాద్ : తెలంగాణచౌక్(కరీంనగర్): నియోజకవర్గాల పునర్విభజన, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి కేంద్రం సిద్ధమవుతుండటంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిప్రెషన్‌లోకి వెళ్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. అందుకే ప్రధానమంత్రిపై దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. దక్షిణాది, ఉత్తరాది అంటూ ప్రాంతీయ విద్వేషాలు రగిలించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. శనివారం కరీంనగర్‌లో తన నివాసంపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్‌ను టీజీరెడ్కో అధికారులు, డిస్ట్రిబ్యూటర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు.

# ముమ్మరంగా వరి కోతలు కేంద్రాలకు ఎదురుచూపు



ఖమ్మం జిల్లా, ప్రజాస్ఫూర్తి : ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వరి కోతలు ప్రారంభమై పది రోజులు గడుస్తున్నా అధికారులు ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు . దీంతో రైతులు గత్యంతరం లేక తక్కువ ధరకే దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వం మద్దతు ధర కల్పించి , తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# ఫార్మసీ పుస్తకాల కొనుగోలుకు టెండర్లు ఆహ్వానం




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: 202627 విద్యా సంవత్సరానికి గాను మహబూబాబాద్ లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా ఫార్మసీ మహిళా కళాశాల కోసం బి.ఫార్మసీ పుస్తకాల కొనుగోలుకు కొటేషన్లు ఆహ్వానించబడుతున్నట్లు జిల్లా తెలంగాణ సాంఘీక సంక్షేమ మహిళా రెసిడెన్షియల్ ఫార్మసీ కళాశాల జిల్లా కో.ఆర్డినేటర్ జి.జయశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆసక్తి గల వ్యక్తులు,సంస్థలు తమ కొటేషన్లను ఈ నెల 29 నుంచి వచ్చే ఏప్రిల్ 2 వ తేది సాయంత్రం 4 గంటల వరకు మహబూబాబాద్ పట్టణంలోని కేసముద్రం రోడ్డులోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీ నందు సమర్పించగలరని ఈ సందర్భంగా అధికారి పేర్కొన్నారు.


# రూ . 2 కోట్లు మోసం చేసిన కేసులో ఇద్దరి అరెస్ట్



ఖమ్మం జిల్లా, ప్రజాస్ఫూర్తి : ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు శనివారం ఆన్లైన్ ట్రేడింగ్ మోసం కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. అద్దిక లాబాలు వస్తాయని ఆశ చూపించి వాట్సప్ ద్వారా ట్రేడింగ్ లింకులు పంపించి ఖమ్మం జిల్లాకు చెందిన వ్యాపారిని సుమారు రూ . 2 కోట్ల మేర మోసం చేసినట్లు గుర్తించారు. ఎండి సాదిక్, శ్యామ్ బాబు పట్టుకొని కోర్టులో హాజరుపరిచి రిమాండ్కు తరలించారు . సిపి సిబ్బందిని అభినందిచారు.

# వినియోగదారుల హక్కులకు భరోసా

*** హీరో బైక్ షోరూమ్‌కు భారీ జరిమానా**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కొత్త వాహనం కొన్నాక సాంకేతిక లోపాలు తలెత్తితే షోరూమ్ నిర్వాహకులు బాధ్యత వహించాల్సిందేనని, వినియోగదారుల రక్షణకు న్యాయవ్యవస్థ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఉమ్మడి నల్గొండ జిల్లా వినియోగదారుల ఫోరమ్ స్పష్టం చేసింది. లోపభూయిష్ట వాహనాన్ని విక్రయించి, ఆపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన చౌటుప్పల్‌లోని ఓ హీరో మోటార్స్ షోరూమ్‌కు భారీ జరిమానా విధిస్తూ శనివారం సంచలన తీర్పు వెల్లడించింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలానికి చెందిన ఒక యువకుడు స్థానిక హీరో షోరూమ్‌లో రూ.1,03,500లు వెచ్చించి కొత్త మోటార్ సైకిల్‌ను కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో కొద్ది రోజుల్లోనే వాహనంలో తీవ్రమైన సాంకేతిక సమస్యలు తలెత్తాయని గుర్తించిన బాధితుడు ఈ విషయాన్ని షోరూమ్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్ళారు. సంబంధిత షోరూం యాజమాన్యం సమస్యను పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారు. దీంతో తనకు జరిగిన నష్టం, మరి వినియోగదారుడుకి జరగద్దని, అదేవిధంగా తనకు సైతం న్యాయం జరగాలని ఆశించిన బాధితుడు జిల్లా వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించాడు. బాధితుని తరపున అడ్వకేట్ నల్ల పూర్ణచందర్ ఫోరమ్‌లో బలమైన వాదనలు వినిపించారు. షోరూమ్ వైఖరి వల్ల వినియోగదారుడు ఎదుర్కొన్న ఆర్థిక, మానసిక ఇబ్బందులను ఆధారాలతో సహా వివరించారు. వాస్తవాలను పరిశీలించిన ఫోరమ్, షోరూమ్ నిర్వాహకుల తీరును తీవ్రంగా తప్పుబడుతూ ఈ క్రింది విధంగా ఆదేశాలు జారీ చేసింది: అసలు మొత్తం: వాహనం కొనుగోలు ధర రూ.1,03,500లను 9శాతం వడ్డీతో కలిపి బాధితుడికి తిరిగి చెల్లించాలి. మానసిక వేదనకు: వినియోగదారుడు పడ్డ ఇబ్బందులకు గానూ రూ.30వేల పరిహారం చెల్లించాలి. ఇతర ఖర్చులు: రవాణా ఖర్చుల నిమిత్తం మరో రూ.10వేలను అందజేయాలి తీర్పించింది.

## అరుణోదయ 7వ రాష్ట్ర మహాసభల జయప్రదం చేయండి

**: చారి హరీష్**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: ఏప్రిల్ 3న, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా 7వ, మహాసభ ను ఏప్రిల్ 10,11న, హైదరాబాద్ లో జరుగు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ రాష్ట్ర 7వ మహాసభల జయప్రదం చేయాలని శనివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రం లో రాష్ట్ర మహాసభల గోడ ప్రతులను ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి చారి హరీష్ మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు అరుణోదయ తన ఆటపాటలతో చేయూతనందిస్తుందని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ పోరాటంలో అరుణోదయ పాత పాటతో ఉద్యమంలో క్రియాశీల పాత్ర నిర్వహించిందని వారూ తెలిపారు. ఈ సభలో ముఖ్య అతిథిగా ప్రముఖ జర్నలిస్టు సతీష్ చందర్, పి ఓ డబ్ల్యు జాతీయ నాయకురాలు ఝాన్సీ, రైసింగ్ న్యూ డెమోక్రసీ సహసంపాదకులు కే గోవర్ధన్, కానూరి తాత కూతురు బేబీక్క, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వేణు, దాసు,ఉదయగిరి, పాల్గొంటారని వారు తెలిపారు. 2026 ఏప్రిల్ 11వ తేదీన మార్క్స్ భవన్లో రాష్ట్ర మహాసభల ప్రారంభోపన్యాసం ప్రొఫెసర్ కాశీం, వక్తలుగా ప్రొఫెసర్ వినయ్ బాబు, లెల్లే సురేష్, అంబిక, పాల్గొంటారని వారు తెలిపారు. మహాసభల సందర్భంగా సావనీరు ను అరుణోదయ రాష్ట్ర మాజీ అధ్యక్ష కార్యదర్శులు నాగన్న,రామకృష్ణ లు ఆవిష్కరిస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో అరుణోదయ జిల్లా నాయకులు మాదారపు నాగరాజు,కుక్కముడి అనిత, రంగమ్మ, సోనియా, మౌనిక, హైమ, సుజాత, పుష్ప, వెంకటమ్మ, ఎల్లమ్మ,మౌనిక,ఎల్లమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## పాత పద్ధతిలో మెడికల్ బోర్డు నిర్వహించాలి

* **అంబేద్కర్ చిత్రపటానికి వినతిపత్రం అందజేసిన కార్మికులు**


ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం:సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఏఐటియుసి అనుబంధ సింగరేణి కాలనీ వర్కర్స్ యూనియన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పాత పద్ధతిలో మెడికల్ బోర్డు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ పివికే5 గనిలో కార్మికులు శనివారం వినూత్న నిరసన చేపట్టారు. ఏఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులు నల్ల రిబ్బన్లు మొఖాలకు కట్టుకుని, ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి వినతిపత్రం అందజేశారు.అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, కార్మికుల మెడికల్ అన్‌ఫిట్ కారణంగా సింగరేణిపై ఆర్థిక భారం పడుతోందని వ్యాఖ్యానించడం కార్మిక వ్యతిరేకమని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల కుటుంబాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని విమర్శించారు.కార్మిక వ్యతిరేక వ్యాఖ్యలను కప్పిపుచ్చేందుకు ఐఎన్టీయుసి నాయకులు ప్రధాన కార్యాలయం ఎదుట నిరసనలు చేపట్టడం హాస్యాస్పదమని మండిపడ్డారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పాత విధానంలోనే మెడికల్ బోర్డు నిర్వహించాలని, అండర్‌గ్రౌండ్‌లో పనిచేస్తున్న జనరల్ అసిస్టెంట్లను సర్ఫేస్ కన్వర్షన్ చేసి ఖాళీల భర్తీకి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి వి. మల్లికార్జున్‌రావు, సహాయ కార్యదర్శి గట్టయ్యతో పాటు పలువురు యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## సెక్రటేరియేట్‌లో ఎర్త్ అవర్



హైదరాబాద్ : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలను చైతన్యవంతం చేయడానికి గాను నిర్వహించిన ఎర్త్ అవర్‌లో భాగంగా శనివారం రాత్రి 8:30 నుంచి 9:30 గంటల వరకు రాష్ట్ర సచివాలయంలో విద్యుత్ దీపాలను పూర్తిగా నిలిపివేశారు. సచివాలయం ప్రధాన భవనంతో పాటు, సచివాలయంలోని వివిధ కార్యాలయ భవనాలు, గదులు హాళ్లలోనూ విద్యుద్దీపాలను ఆర్పివేశారు. గివ్ యాన్ అవర్ ఫర్ ఎర్త్ అనే నినాదంతో ఎర్త్ అవర్2026 నినాదంతో పర్యావరణ పరిరక్షణ చైతన్యాన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహించారు.

## స్త్రీ నిధి 13వ సర్వసభ్య సమావేశంలో మంత్రి దనసరి సీతక్క



రాజేంద్రనగర్: మనం పుట్టిన ఊరులో అందరూ కలుసుకుని, ఆ గ్రామ అభివృద్ధికి బాటలు వేసుకునేలా ఏప్రిల్ మాసంలో ఒక రోజు గ్రామ ఉత్సవం పేరుతో మనం పుట్టిన ఊరు పిలుస్తుంది రా తెలంగాణ రాష్ట్రంలో ఓ కార్యక్రమాన్ని చేపట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నామని, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫర, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్త్రీ నిధి పరపతి సహకార సమాఖ్య లిమిటెడ్ 13వ వార్షిక సర్వసభ్య సమావేశం శనివారం రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ... మహిళా సంఘాలు బార్డర్లో సైనికుల వలే పనిచేయాలని పిలుపునిచ్చారు. మైక్రో ఫైనాన్స్ సంస్థల భారి నుంచి గ్రామాలు, పట్టణాల మహిళలకు విముక్తి కల్పించడానికి 2011లో ఏర్పాటు చేసిన స్త్రీ నిధి సంస్థ నేడు రూ.5,500 కోట్ల రుణ నిల్వతో కొనసాగుతూ దేశంలోనే ఆదర్శ ప్రాయంగా నిలిచిందన్నారు.

**ఆడబిడ్డల చేతికి ఆదాయం కల్పించి..**

ఆర్థిక, కుటుంబ, గ్రామీణ వ్యవస్థలను బలోపేతం చేయడానికి స్త్రీ నిధిలో ఉన్న 67 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులు కృషి చేయాలన్నారు. గ్రామాలలో చిన్న పిల్లల వివాహాలను ఆపడానికి, మహిళలు స్వేచ్ఛగా తిరగడానికి, అత్యంత పేదరికంలో ఉన్న వారిని ఆదుకోవడానికి మహిళా సంఘాలు ముందుండి పనిచేయాలన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయమని గుర్తు చేశారు. 202425 ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి 154 కోట్ల నికర ఆదాయం పొందడం అభినందనీయం అన్నారు.

# వేసవి త్రాగునీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి

* **ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో అదనపు నిధుల మంజూరు**
* **చౌటుప్పల్ మున్సిపాలిటీ వార్షిక బడ్జెట్ రూ.54.75కోట్లు**
* **చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్**






చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: వేసవి కాలం దృష్ట్యా మున్సిపల్ వ్యాప్తంగా త్రాగునీటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ తెలిపారు. చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ముగుదాల పావని రమేష్ అధ్యక్షతన వార్షిక బడ్జెట్ సమావేశం నిర్వహించారు. 202627ఆర్థిక సంవత్సరానికి గానూ వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.54.75కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టి, కౌన్సిల్ ఆమోదం పొందింది. ఈ సందర్భంగా సమావేశంలో చర్చించిన కీలక అంశాలను చర్చించారు. త్రాగునీటి సమస్య పరిష్కారానికి అమృత్ మిత్ర ప్రాజెక్ట్ కింద చేపట్టిన వాటర్ ట్యాంకుల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, తద్వారా పట్టణంలో ఉన్న నీటి కొరతను తీర్చాలని కౌన్సిలర్లు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద కేటాయించిన బడ్జెట్‌ను ప్రజా మరుగుదొడ్ల నిర్మాణానికి, పట్టణ పారిశుద్ధ్య మెరుగుదలకు వినియోగించాలని తీర్మాణించారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కౌన్సిల్ నిర్ణయించింది. అనంతరం చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చౌటుప్పల్ అభివృద్ధికి కావలసిన అదనపు నిధులను మంజూరు చేయించుకుంటామన్నారు. సమిష్టిగా పనిచేసి వేసవి త్రాగునీటి ఇబ్బందులను అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేస్తామన్నారు అభివృద్ధి పనుల కేటాయింపులపై తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదిస్తూ బడ్జెట్ సమావేశాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. వెంకట్రామిరెడ్డి, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు, సీనియర్ అకౌంట్స్ అధికారి వరలక్ష్మి, ఏఈ నితీష్ కుమార్, మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్.ఓ. అంజయ్య, సీనియర్ అసిస్టెంట్ రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

## గొప్ప చరిత్ర కలిగిన హైదరాబాద్ ను కాపాడడమే ప్రభుత్వ సంకల్పం

* **రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి**



రంగారెడ్డి జిల్లా , ప్రజాస్ఫూర్తి : మానవ తప్పిదాల వల్ల గొప్ప చరిత్ర కలిగిన హైదరాబాద్ కనుమరుగయ్యే ప్రమాదం నుంచి కాపాడి భవిష్యత్తరాలకు అత్యద్భుతమైన నగరాన్ని అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టులో భాగంగా మూసీ తీరం గండిపేట మండలం మంచిరేవులలోని చారిత్రక వీరభద్రస్వామి ప్రాంగణంలో శ్రీ మచిలేశ్వర స్వామి, శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి, అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి శంకుస్థాపన చేశారు. ఆలయ ప్రాంగణంలో గోవు పూజ నిర్వహించి గోశాలను ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతు ఒక చారిత్రాత్మక మందిరాన్ని నిర్మించుకోవడం ఒక చారిత్రక సందర్భం, ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఇది జరుగుతుందని అనుకోవట్లేదని, శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అంటారన్నారు., ఇది దైవేచ్ఛతో జరుగుతున్న కార్యక్రమమని అన్నారు. చరిత్రను గమనించినప్పుడు నదీ పరీవాహన ప్రాంతాలు, సముద్ర తీరాల్లోని ప్రాంతాలు అభివృద్ధిని సాధించాయన్నారు. తెలంగాణ సముద్రతీరం లేని రాష్ట్రమని, రాష్ట్రంలో కృష్ణా, గోదావరి, ఈసా నదులున్నా ఆ జలాలను సరిగా వినియోగించుకోకపోవడం వల్ల కొన్ని తరాలు నష్టపోయాయని తెలిపారు.8 ఎకరాల్లో 700 కోట్లతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామని, ఈ ప్రాంతానికి 1400 ఏళ్ల చరిత్ర ఉందని, ఈ చరిత్ర కనుమరుగు కాకుండా భవిష్యత్ తరాలకు అందించాలన్నదే ప్రభుత్వ ఆలోచన, మూసీ నది పునరుజ్జీవింపై చాలా మంది ప్రయత్నించారని, కారణాలు ఏవైనా ఆ ప్రయత్నాలు ముందుకు సాగలేదని, ఆ అవకాశం మనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఎన్ని విమర్శలు వచ్చినా, అడ్డంకులు సృష్టించినా దేవుడే వాటిని తొలగిస్తాడని అన్నారు. చరిత్రను గమనిస్తే నది పరీవాహకంలోనే నాగరికత అభివృద్ధి చెందింది, సముద్ర పరీవాహకంలో వ్యాపారం, ఆర్థిక అభివృద్ధి జరిగిందని, దేశంలో సముద్రపు ఒడ్డు లేని రాష్ట్రం తెలంగాణ ఒక్కటే, మూసా, ఈసా నదులు ఉన్నా సరైన విధంగా ఉపయోగించుకోలేదన్నారు. మానవ తప్పిదాలతోనే మూసీ కాలుష్యకారకంగా మారిందని, గొప్ప చరిత్ర కలిగిన హైదరాబాద్ చరిత్ర కనుమరుగయ్యే పరిస్థితి దాపురించిందన్నారు. ఢిల్లీ లాంటి నగరాల్లో కాలుష్యంతో జన జీవనం స్తంభించిన పరిస్థితి, అలాంటి నగరాల నుంచి మనం నేచుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. హైదరాబాద్ నగరం మత సామరస్యానికి వేదిక మూసీ పరీవాహకంలో చారిత్రక శివాలయాన్ని పునర్నిర్మించాలని ఈశ్వరుని ఆశీర్వాదంతో పనులు మొదలు పెట్టామన్నారు. మూసీ పరివాహకంలో మతసామరస్యానికి చిహ్నంగా ఒక మసీదు,నాగోల్ ప్రాంతంలో ఒక చర్చిని నిర్మించబోతున్నామన్నారు. పురాణాపూల్ వద్ద మసీదు, గౌలిగూడ సమీపంలో గురుద్వారా నిర్మిస్తామని తెలిపారు. గోదావరి జలాలను తరలించి మూసీలో నిరంతరం నీరు పారేలా చర్యలు తీసుకుంటున్నామని, మూసీ కాలుష్యంతో నల్లగొండ జిల్లా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మానవ తప్పిదాలను సరిద్దిద్దకపోతే చరిత్ర మనల్ని క్షమించదని తెలిపారు. రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతామని, ఇది ఓట్ల కోసం.. నోట్ల కోసం చేస్తున్న పని కాదని, దేవుడి ఇచ్చిన గొప్ప అవకాశమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, కాలె యాదయ్య, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఎంఆర్డిసిఎల్ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.


## కార్మిక సమస్యల పరిష్కారమే ధ్యేయం

* **ఏఐటియుసి ఆధ్వర్యంలో 'సేవ్ సింగరేణి' భారీ బైక్ ర్యాలీ**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న 'సేవ్ సింగరేణి జాతా'లో భాగంగా రుద్రంపూర్ ప్రాంతంలో శనివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది కార్మికులు పాల్గొని సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. ర్యాలీ అనంతరం జరిగిన సమావేశంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ యాజమాన్య తీరుపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. సింగరేణి సంస్థ మనుగడ కోసం తక్షణమే కొత్త బొగ్గు బ్లాకులను ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు.కార్మికులపై పడుతున్న ఆదాయపు పన్ను భారాన్ని కోల్ ఇండియా తరహాలో సంస్థే భరించాలని, లేదంటే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పాత విధానంలోనే మెడికల్ బోర్డును కొనసాగించాలని, కార్మిక సంక్షేమంపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. కార్పొరేట్ స్థాయిలో కుదిరిన స్ట్రక్చర్ కమిటీ ఒప్పందాలను అమలు చేయకపోతే భవిష్యత్తులో పోరాటాలు మరింత తీవ్రతరమవుతాయని నాయకులు స్పష్టం చేశారు. అసెంబ్లీలో సింగరేణి కార్మికుల సమస్యలను లేవనెత్తుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాత్రను వారు కొనియాడారు.మార్చి 30న ముగియనున్న ఈ జాతాలో సింగరేణి వ్యాప్తంగా కార్మికులు ఏకమై తమ హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్మికుల చిరకాల వాంఛ అయిన సొంత ఇల్లు పథకాన్ని వెంటనే అమలు చేయాలని, మెడికల్ అన్‌ఫిట్ కార్మికుల కుటుంబాలకు, ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వారి పిల్లలకు అవకాశాలు కల్పించాలని రాజ్ కుమార్ కోరారు.కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని, ఎన్1 సర్క్యులర్‌ను రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఒప్పందాలను వెంటనే అమలు చేయకపోతే సింగరేణి వ్యాప్తంగా కార్మిక గర్జన తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వీరభద్రం, వైవీ రావు, ముస్కే సమ్మయ్య, వంగ వెంకట్, మల్లికార్జున్, వీరస్వామి, గట్టయ్య, సందేబోయిన శ్రీనివాస్, నాగేశ్వరరావు, రాము, గుమ్మడి వీరయ్య, హీరాలాల్, ఎంఆర్‌కే ప్రసాద్, కమల్, మధుకృష్ణ, రాజేశ్వరరావు, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అందరికీ ధైర్యం.. (108) అత్యవసర వాహనం




ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం 108 వాహనాన్ని జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ సామ్రాట్ , జిల్లా కోఆర్డినేటర్ కొండలరావు లు శనివారం ఉదయం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అత్యవసర వైద్య సేవలు అందించడంలో గత మూడు నెలల నుండి రాష్ట్రంలో జన్నారం (108) అత్యవసర వాహనం మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు.ఎక్కడైనా ప్రమాదం జరిగిన క్షణాలలో అక్కడికి చేరుకొని వెంటనే ప్రథమ చికిత్స అందించి పలువురి ప్రాణాలను నిలుపుతున్నారు 108 వాహన సిబ్బంది. ముఖ్యంగా రాత్రి పగలు అనే తేడా లేకుండా 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ గర్భిణీలకు పురిటి నొప్పులు వచ్చినప్పుడు కాని, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు గానీ వారు సమాచారం అందుకున్న కొన్ని సెకండ్లలోనే తమ వాహనంతో బయలుదేరి సంఘటన స్థలానికి చేరుకొని చికిత్సను అందిస్తున్నారు.ముఖ్యంగా ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులను ఆసుపత్రికి గోల్డెన్ అవర్లో చేరుస్తూ ఎంతోమంది ప్రాణాలను కాపాడడంలో తమ వంతు పాత్రను ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని అన్నారు.2025 ఏప్రిల్ నుండి 2026 మార్చ్ వరకు అత్యవసర వాహనం ద్వారా జిల్లా వ్యాప్తంగా 22308 కేసులు నమోదు అయ్యాయని వారు తెలిపారు.ఈ సందర్భంగా 108 సిబ్బంది ఈఎంటి కిషన్, రమేష్, రఫీక్,గంగాధర్ లు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను సకాలంలో కాపాడడం తమకు ఎంతో సంతోషాన్నిస్తుందని ఆనందం వ్యక్తం చేశారు.

## నగర పాలక సంస్థ 20262027 సంవత్సరపు బడ్జెట్ ఆమోదం




నిజామాబాద్: నగరపాలక సంస్థ 2026 2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదించిన బడ్జెట్ ఆమోదం పొందింది. శనివారం నిజామాబాద్ నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ కూరగాయల ఉమారాణి అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్త, కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ లు పాల్గొన్నారు. 2026 2027 సంవత్సరానికి సంబంధించిన ప్రతిపాదిత బడ్జెట్ తో పాటు, 2025 2026 సవరించిన అంచనా బడ్జెట్ ను సమావేశంలో ప్రవేశపెట్టగా.. కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. 2025 ఏప్రిల్ 01 నాటికి ప్రారంభ నిల్వ రూ. 9471.33 లక్షలు, 2025 2026 సవరణ అంచనా ఆదాయం రూ. 13717.11 లక్షలు కలుపుకుని మొత్తం రూ. 23188.44 లక్షలుగా పేర్కొన్నారు. 2026 2027 సంవత్సరపు సాధారణ నిధుల అంచనా ఆదాయం రూ. 14763.60 లక్షలుగా బడ్జెట్ లో పొందుపర్చారు. ప్లాన్ అండ్ నాన్ ప్లాన్ గ్రాంట్ల ద్వారా రూ. 9937.00 లక్షల ఆదాయం సమకూరుతుందని అంచనా వేశారు. అదేవిధంగా మొత్తం అంచనా వ్యయం రూ. 24700.60 లక్షలుగా బడ్జెట్ పద్దులో పేర్కొన్నారు. ప్రతిపాదిత బడ్జెట్ వివరాలను సమావేశంలో చదివి వినిపించగా, సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా తమ తమ డివిజన్లలో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్లు సమావేశంలో ప్రస్తావించగా.. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ ఇలా త్రిపాఠి సానుకూలంగా స్పందించారు. ఎన్నికల వరకే రాజకీయాలు పరిమితం అని, నిజామాబాద్ నగర అభివృద్ధే ధ్యేయంగా అందరం పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా కృషి చేద్దామని ఎమ్మెల్సీ మహేష్ కుమార్ సూచించారు. నిజామాబాద్ నగరానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డిని కోరగా.. సీఎం సానుకూలంగా స్పందించినట్లు మహేష్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపులో అన్ని డివిజన్లకు సమ ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్సీ సూచించారు.

## మల్కాజిగిరిలో ఏప్రిల్ 1 నుంచి చికెన్ షాపులు మూసివేస్తామని హెచ్చరిక




మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : మల్కాజిగిరిలో చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చికెన్ వ్యాపారులు పౌల్ట్రీ రంగంలో ఆధిపత్యం చెలాయిస్తున్న కార్పొరేట్ సంస్థలపై తీవ్ర విమర్శలు చేశారు. కార్పొరేట్ సంస్థల విధానాల వల్ల తాము తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నామని, "నష్టాలు మాకు... లాభాలు మీకా?" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కోళ్ల ఫారం నుంచి రిటైల్ మార్కెట్ వరకు కార్పొరేట్ సంస్థల ప్రభావం పెరిగి, చిన్న వ్యాపారుల జీవనోపాధిని దెబ్బతీస్తోందని ఆరోపించారు. పౌల్ట్రీ రంగంలో గుత్తాధిపత్యం పెరగడం వల్ల చిన్నస్థాయి చికెన్ షాప్ నిర్వాహకులు ఆర్థికంగా కుంగిపోతున్నారని తెలిపారు. తమకు రావాల్సిన మార్జిన్‌ను తగ్గించి, రిటైల్ వ్యాపారులపై భారాన్ని మోపుతున్నారని మండిపడ్డారు.గత ఆరు నెలలుగా పరిస్థితి మరింత దిగజారిందని, కోళ్ల ధరలు అకస్మాత్తుగా పెరగడం, మళ్లీ తగ్గడం వల్ల తీవ్ర ఆర్థిక నష్టాలు వాటిల్లుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 వేల చికెన్ షాపులు ఈ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వివరించారు.తమ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా చికెన్ దుకాణాలను మూసివేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చికెన్ షాప్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# జిల్లాలో వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ కు ఎలాంటి కొరత లేదు

* రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

రంగారెడ్డి జిల్లా, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ కు ఎలాంటి కొరత లేదు, ప్రజలు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని మినీ సమావేశ మందిరం నందు సివిల్ సప్లై అధికారులు, గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోల్ బంకుల నిర్వాహకులతో జిల్లాలో గ్యాస్ పెట్రోల్, డీజిల్ సరఫరా, వినియోగంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. జిల్లాలో గ్యాస్ సరఫరాకు ఎటువంటి కొరత లేదని, తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలు అనవసర ఆందోళనకు గురికాకుండా, అవసరాన్ని బట్టి సమయానికి గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో గ్యాస్ వినియోగదారులు తరచుగా అవసరం లేకుండా బుకింగ్‌లు చేయడం వల్ల సరఫరా వ్యవస్థపై అనవసర ఒత్తిడి ఏర్పడుతుందని తెలిపారు. గ్యాస్ బుకింగ్ చేసిన తర్వాత, సంబంధిత ఏజెన్సీలు వినియోగదారుల ఇళ్ల వద్దకే సిలిండర్‌ను సరఫరా చేస్తాయని తెలిపారు. ఎవ్వరూ గ్యాస్ ఏజెన్సీలు లేదా గోదాముల వద్దకు స్వయంగా వెళ్లి వేచి




ఉండవద్దని స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకారం వినియోగదారుల తేదీ వచ్చినప్పుడు గ్యాస్ సిలిండర్‌ను తప్పనిసరిగా ఇంటి వద్దకే అందజేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు కొరత లేదని, ప్రజలు పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరి కొరత ఉన్నదని సమస్యలు సృష్టించకుండా, అధిక మోతాదులో తీసుకొని ఇండ్లలో నిల్వ చేసుకోవద్దని, దాని ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున ప్రజలు అవసరానికి మాత్రమే తీసుకోవాలని సూచించారు. పెట్రోల్ బంకుల నిర్వహకులు వాహనాలలో మాత్రమే పెట్రోల్, డీజిల్ వేయాలని, క్యాన్స్ లో, బాటిల్స్ లో వేయరాదని, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్కూల్, ఆసుపత్రి వంటి ప్రాధాన్యత కలిగిన వాహనాలకు సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు సరిపడా ఉన్నాయని, సరఫరాలో ఎలాంటి సమస్యలు లేవని ప్రజలకు గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోల్ బంకుల నిర్వహకులు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో సరఫరా సక్రమంగా కొనసాగుతోంది. కాబట్టి ప్రజలు అపోహలు, వదంతులను నమ్మకుండా ప్రశాంతంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి, జిల్లా సివిల్ సప్లై అధికారి వనజాత, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు రామేశ్వరి దేవి, కేషు రామ్, వ్యవసాయ శాఖ అధికారి ఉషా, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, పెట్రోల్ బంకుల నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : పట్టణ అభివృద్ధికి, పేదల గృహ స్వప్నాలకు కొత్త ఊపునిస్తూ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. 12వ వార్డు కౌన్సిలర్ కళ్యాణ్ కార్ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం స్థానికంగా విశేష స్పందన పొందింది.ఈ సందర్భంగా లబ్ధిదారురాలు కౌసర్ బేగం భర్త లియాఖత్ కు గృహ పత్రాలను అందజేశారు. స్వంత ఇల్లు కల సాకారం కావడంతో ఆమె కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హుడికి చేరవేయడం తమ లక్ష్యమని తెలిపారు. పట్టణంలో మరింత అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పెంటయ్య, కొప్పునూర్ ప్రవీణ్, సీనియర్ నాయకులు గంగనామోని సత్తయ్య, లియాఖత్, మహబూబ్, రవుఫ్, సాయి, షరీఫ్, రాహుల్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నిమ్స్ ఆసుపత్రిలో ఆరోగ్యశాఖ మంత్రి ఆకస్మిక తనిఖీలు



హైదరాబాద్ : రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శనివారం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఓపీ బ్లాక్‌లో అవుట్ పేషెంట్ రిజిస్ట్రేషన్, ఫార్మసీ, శాంపిల్ కలెక్షన్ ల్యాబ్‌లను నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. పేషెంట్లతో ఆప్యాయతతో పలకరించి, వారికి మెరుగైన వైద్య సదుపాయాలు, సేవల కల్పనపై సూచనలు చేశారు. అనంతరం అనారోగ్యంతో చికిత్స పొందుతున్న గద్దర్ సతీమణి విమలమ్మను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

## నేత్రపర్వంగా శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం

* **రామనామ స్మరణలతో మార్మోగిన మిథిలా స్టేడియం**
* **పట్టువస్త్రాలు సమర్పించిన రాష్ట్ర గవర్నర్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శనివారం నిర్వహించిన శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మిథిలా ప్రాంగణంలో అత్యంత వైభవంగా జరిగిన ఈ మహోత్సవంలో దేశ నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని ఆస్వాదించారు. రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్ల మహోత్సవానికి హాజరై స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించి ఆశీస్సులు పొందారు. మహోత్సవాన్ని ఆద్యంతం తిలకిస్తూ భక్తి పరవశంలో పాల్గొన్నారు. పట్టాభిషేక వేడుకలు సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. తొలుత రామాలయంలో భద్రుని మండపంలో స్వామివారి పాదుకలకు అభిషేకం నిర్వహించారు. అనంతరం గౌతమీ నదీ తీరంనుంచి పవిత్ర తీర్థములను తీసుకువచ్చి రాజ లాంఛనాలతో మిథిలా ప్రాంగణానికి ఊరేగింపుగా స్వామివారిని తీసుకువచ్చారు. భాజా భజంత్రీల నాదాలు, సన్నాయి మేళాలు, భక్తుల కోలాటాలతో ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. కళ్యాణ మండపంలో స్వామివారు ఆశీనులైన అనంతరం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం నిర్వహించారు. తరువాత పాదుకలు, రాజదండం, రాజముద్రిక, స్వర్ణ కిరీటం, ఖడ్గం, రత్నాభరణాలతో స్వామివారికి రాజలాంఛనాలు అలంకరించి పట్టాభిషేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణ వేద పారాయణాలతో పాటు విష్ణు పురాణం, భగవత్ శాస్త్ర పారాయణాలు జరిగాయి. పుష్కర జలాలతో మహాకుంభ తీర్థప్రోక్షణ నిర్వహించగా, అనంతరం హారతులు సమర్పించారు.

– **రామనామస్మరణతో మారుమ్రోగిని మిథిలా స్టేడియం**



పట్టాభిషేక వేడుకల సందర్భంగా మిథిలా ప్రాంగణం మొత్తం శ్రీరామ నామ స్మరణలతో మార్మోగింది. కార్యక్రమం అనంతరం భక్తులపై పుణ్య నదీ జలాలను చల్లి ఆశీర్వదించారు. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణం, పట్టాభిషేకం వంటి ప్రధాన వేడుకలకు హాజరైన భక్తులు తీపి జ్ఞాపకాలతో వెనుదిరిగారు. ఈ మహోత్సవంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం సబ్ కలెక్టర్ మణాల్ శ్రేష్ట ఐటీడీఏ పీఓ రాహుల్, దేవస్థానం ఈవో దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు.

* **గిరి మార్ట్ను ప్రారంభించిన గవర్నర్ శివప్రతాప్**

ఐటీడీఏ ఆధ్వర్యంలో భద్రాచలంలో నూతనంగా ఏర్పాటు చేసిన గిరి మార్ట్‌ను గవర్నర్ శివప్రతాప్ సతీసమేతంగా ప్రారంభించారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధి, వారి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించడం లక్ష్యంగా ఈ గిరి మార్ట్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అడవి ఉత్పత్తులు, సేంద్రీయ ఆహార పదార్థాలు, గిరిజన హస్తకళా వస్తువులను ఒకే వేదికపై విక్రయానికి అందుబాటులో ఉంచడం ద్వారా గిరిజనులకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. గిరి మార్ట్ ప్రారంభానంతరం అక్కడ అమ్మకానికి ఉంచిన గిరిజన ఉత్పత్తులను గవర్నర్ సతీసమేతంగా పరిశీలించి, వాటి ప్రత్యేకతలు, తయారీ విధానం, మార్కెటింగ్ సదుపాయాల గురించి జిల్లా కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. గవర్నర్ పర్యటనను దృష్టిలో ఉంచుకొని పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసి శాంతిభద్రతలను కట్టుదిట్టంగా నిర్వహించారు. మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడంలో జిల్లా యంత్రాంగం సమన్వయంతో కృషి చేసింది.

## ఎమ్మెల్యేల వినతులపై యాక్షన్ ప్లాన్ సిద్ధం



రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం అమలుతో పెరిగిన రద్దీకి అనుగుణంగా ఆర్టీసీలో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఉమ్మడి జిల్లాల వారీగా ఆర్టీసీ సమస్యలపై నిర్వహిస్తున్న ముఖాముఖి సమావేశాల్లో భాగంగా మూడో రోజు శనివారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు అందజేసిన వినతులపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు. కొత్త బస్సులు, కొత్త రూట్ల కేటాయింపుతో పాటు బస్టాండ్‌లో టాయిలెట్స్ వంటి కనీస వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రజాప్రతినిధుల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. బస్టాండ్ల అభివృద్ధికి ఎమ్మెల్యేలు తమ నిధుల నుంచి సహకరించాలని కోరారు.

**ఎమ్మెల్యేల ప్రధాన విన్నపాలు..**

కరీంనగర్ ఉమ్మడి జిల్లా: చెన్నూరులో బస్టాండ్ అభివృద్ధి, సింగరేణి ఏరియాలో అదనపు రూట్లు కావాలని మంత్రి వివేక్ వెంకటస్వామి కోరారు. కోరుట్ల, మెట్‌పల్లి బస్టాండ్ల ఆధునీకరణతో పాటు హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు కావాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ విన్నవించారు. వేములవాడకు అన్ని జిల్లాల నుంచి కనెక్టివిటీ పెంచాలని విప్ ఆది శ్రీనివాస్ కోరగా, పెద్దపల్లి డిపో పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే విజయరమణారావు కోరారు. హుజూరాబాద్‌లోని కమలాపూర్ బస్టాండ్‌కు అదనపు నిధులు, రామగుండంలో సిటీ బస్సులు పునరుద్ధరించాలని కౌశిక్ రెడ్డి, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ కోరారు.
ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా: ఆసిఫాబాద్ పాత బస్టాండ్ పునరుద్ధరణ, గ్రామాలకు పల్లె వెలుగు బస్సులు పెంచాలని ఎమ్మెల్యే కోవా లక్ష్మి కోరారు. బాసర బస్టాండ్‌ను పుష్కరాల లోపు ఆధునీకరించాలని రామారావు పటేల్, ఖానాపూర్ నుంచి ఆదిలాబాద్, హైదరాబాద్‌కు సర్వీసులు పెంచాలని వెడ్మ బొజ్జు విన్నవించారు. ఇచ్చోడ బస్టాండ్ పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు.
ఖమ్మం ఉమ్మడి జిల్లా: దమ్మపేట బస్టాండ్ పనులు త్వరగా చేపట్టాలని ఎమ్మెల్యే ఆది నారాయణ, మణుగూరు సింగరేణి ప్రాంతానికి అదనపు బస్సులు కేటాయించాలని పాయం వెంకటేశ్వర్లు కోరారు. సరిహద్దు నియోజకవర్గమైన వైరాకు అంతర్రాష్ట్ర సర్వీసులు పెంచాలని రాందాస్ నాయక్ విన్నవించారు. ఈ సమావేశంలో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఉన్నతాధికారులు మరియు ఆయా జిల్లాల ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## ఇకపై అంగన్‌వాడీ విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్..




హైదరాబాద్ : రాష్ట్రంలో అంగన్‌వాడీ విద్యార్థుల ఆరోగ్యం, పౌష్టికాహార లభ్యతే లక్ష్యంగా బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ 'తొలి ముద్ద' పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఇక నుంచి ప్రతిరోజూ ఉదయం చిన్నారులకు రుచికరమైన ఉప్మా, కిచిడీ మిక్స్ (రెడీ టూ కుక్‌ఫుడ్) వంటి పదార్థాలను అందించనున్నారు. అసెంబ్లీ ప్రాంగణలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, సీతా దయాకర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం సీఎం రేవంత్ మాట్లాడుతూ.. దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, వ్యవసాయాభివృద్ధికి తొలి ప్రధాని నెహ్రూ విద్యా, ఇరిగేషన్‌కు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. దేశంలో ఆహార భద్రత ఉంది.. కానీ, పౌష్టికాహారం మాత్రం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచి తల్లికి పౌష్టికాహారం అందిస్తున్నదని చెప్పారు. తాజాగా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కూడా ప్రారంభించామని తెలిపారు. ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా, అమలు చేయాల్సింది మాత్రం అంగన్‌వాడీ టీచర్లేనన్నారు. అంగన్‌వాడీ చిన్నారులను సొంత బిడ్డల్లా చూసుకుని వారికి పౌష్టికాహారం అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు ఇకపై అద్దె భవనాల్లో ఉండకూడదని.. వాటికి సొంత భవనాలు నిర్మించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వం తమ కుటుంబ సభ్యుల్లా భావిస్తుందని.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడగానే వారి సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు, పారదర్శకత కోసం అంగన్‌వాడీ వర్కర్లకు మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. 'తొలి ముద్ద' పథకాన్ని తొలుత హైదరాబాద్‌లోని సుమారు 970 అంగన్వాడీ కేంద్రాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేయనున్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నారు. చిన్నారులకు వారానికి ఆరు రోజులు వేడివేడిగా, రుచికరమైన అల్పాహారం అందిస్తారు. మెనూలో దోసె, చపాతీ, మిల్లెట్ ఇడ్లీ, పూరీ, మిల్లెట్ ఉప్మా వంటివి ఉంటాయి. అదనంగా రోజు విడిచి రోజు పాలు, రాగిజావ కూడా అందించనున్నారు.

## ఇంటి పన్ను కట్టకుంటే కరెంట్ కట్.. ఆ మున్సిపాల్టీలో కొత్త నిబంధన




హైదరాబాద్ : సాధారణంగా కరెంటు బిల్లు కట్టకపోతే, బకాయిలు ఎక్కువైతే విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తూ ఉంటారు. ఏవైనా పన్నులు కట్టాల్సి ఉంటే పంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి క్లియరెన్సులు నిలిచిపోతుంటాయి. ఆ మున్సిపాలిటీ పరిధిలో ఇంటిపన్ను కట్టకపోతే అధికారులు సరికొత్త నిబంధన తీసుకొచ్చింది. ఇకపై ఇంటిపన్ను చెల్లించకపోతే కరెంటు కట్ చేస్తామని స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపాలిటీలో ఇంటి పన్ను వసూళ్ల కోసం అధికారులు అవలంబిస్తున్న ఈ కొత్త పద్ధతి ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేసే అధికారం విద్యుత్ శాఖకు మాత్రమే ఉంటుంది. అయితే మున్సిపల్ పన్ను బకాయిల కోసం అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికే 90 శాతం ఇంటి పన్ను వసూలు చేసిన మున్సిపల్ అధికారులు 100 శాతం ఇంటి పన్ను వసూలు కోసం ఈ నిబంధన తీసుకొచ్చినట్లు చెప్పారు. కాగా, గృహలక్ష్మి పథకం అమలవుతున్న తమ ఇండ్ల కరెంట్ కట్ చేయడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మొండి బాకీ వసూలు చేయడానికి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో విద్యుత్ శాఖ అధికారుల సహాయంతో ఆ ఇంటి విద్యుత్, వాటర్ కలెక్షన్లు కట్ చేస్తున్నట్లు కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవీందర్ తెలిపారు. కరెంట్ కట్ చేసే పరిస్థితి రాకుండా అందరు సహకరించి ఇంటి పన్నులను చెల్లించాలని పట్టణ ప్రజలను కమిషనర్ కోరారు.

## ఏప్రిల్ 2 వరకు రాష్ట్రంలో వర్షాలు.. వెల్లడించిన వాతావరణశాఖ..!

హైదరాబాద్ : ఏప్రిల్ 2 వరకు రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. రాబోయే మూడురోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీల వరకు క్రమంగా పెరిగే అవకాశం ఉందని, ఆ తర్వాత నాలుగు రోజుల్లో సాధారణ స్థాయిలో ఉంటాయని పేర్కొంది. శనివారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, నల్గొండ, సూర్యాపేట, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం పడే సూచనలున్నాయని తెలిపింది. ఆదివారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడే అవకాశాలున్నాయని తెలిపింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో వర్షాలు కురిసేందుకు అవకాశాలున్నాయని పేర్కొంది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది.

## ఇక ఓఆర్ఆర్ లోపలే సిటీ బస్సులు.. సిబ్బంది జిల్లా డిపోలకు!




హైదరాబాద్ : ఇక సిటీ బస్సులు ఔటర్ రింగ్ రోడ్డు లోపలే తిరగనున్నాయి. రానున్న రోజుల్లో హైదరాబాద్ లో మొత్తం ఎలక్ట్రిక్ బస్సు లే ప్రయాణికులను చేరవేస్తాయి. ఈ నేపథ్యంలో డీజిల్ బస్సుల్లో పని చేస్తున్న సిబ్బందిని జిల్లా డిపోలకు తరలించేందుకు ఆర్టీసీ ప్రణాళికలు రచిస్తోంది. కాగా సిబ్బంది బదిలీలో కండక్టర్లను మినహాయించనున్నట్లు తెలుస్తోంది. నగరంలోని సిబ్బందికి ఇచ్చే అధిక అద్దె భత్యం, సీసీఏ భారం తగ్గించుకునే యోచనలో ఆర్టీసీ ఉన్నట్లు సమాచారం. దీంతో దాదాపు 8000 మంది ఉద్యోగుల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. హైదరాబాద్ నగరం నుంచి 30-50 కిలోమీటర్ల దూర ప్రాంతాలకు తిరుగుతున్న సిటీ బస్సులను జిల్లా డిపోలకు తరలించనున్నారు. సదరు సిబ్బందిని కూడా జిల్లా డిపోలకు బదిలీ చేస్తారు. ఈ ప్రక్రియను ఇప్పటి నుంచే మొదలు పెట్టేందుకు ఆర్టీసీ అడుగులు వేస్తోంది. గ్రేటర్ నగర డిపోల్లో పనిచేసే ఆర్టీసీ సిబ్బందికి, జిల్లా డిపోల్లో పనిచేసే సిబ్బంది కంటే ఎక్కువ అద్దె భత్యం, ప్రత్యేక నగర పరిహార భత్యం (సీసీఏ) ఉంది. ఆర్టీసీ ఈ భారాన్ని తగ్గించుకునే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టే ఆలోచనపై ఆర్టీసీ కార్మిక సంఘాలు నిరసనలు కొనసాగిస్తున్నాయి. ఈ క్రమంలో శనివారం రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ దీనిపై అసెంబ్లీలో మాట్లాడారు. డిపోల ప్రైవేటీకరణ అనేది పూర్తిగా అవాస్తవమన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా వచ్చే ఆదాయం సైతం సంస్థకే వెళ్తుందని తెలిపారు. ఆర్టీసీ విలీన ప్రక్రియ నివేదిక ఇంకా తమకు అందలేదని వివరించారు. ఏ ఒక్క ఉద్యోగిని కూడా తొలగించమని పొన్నం స్పష్టం చేశారు.

## ఇళ్లు, భూములు లాక్కుంటే చూస్తూ కూర్చోవాలా?: సబితా ఇంద్రారెడ్డి



హైదరాబాద్: ప్రజలకు నష్టం జరిగితే.. ఆరు నూరైనా అడ్డుకొని తీరుతామని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మమ్మల్ని సామాజిక బహిష్కరణ చేస్తారని సీఎం అంటున్నారని, ఆయన మాటలకు భయపడేది లేదని చెప్పారు. రెండేళ్లు ఆగితే ప్రజలే కాంగ్రెస్‌ను బహిష్కరిస్తారని విమర్శించారు. "మూసీ ప్రక్షాళన పేరుతో 10 వేల ఇళ్లను కూల్చే ప్రయత్నం చేస్తున్నారు. మూడు వేల ఎకరాలు తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. మేం మూసీకి వ్యతిరేకం కాదు.. ప్రభుత్వం దోపిడీకి వ్యతిరేకం. ఇళ్లు, భూములు లాక్కుంటుంటే మేం చూస్తూ కూర్చోవాలా? ప్రజల కోసం కోర్టులకే కాదు.. ఎంత దూరమైనా వెళ్తాం" అని సబితా ఇంద్రారెడ్డి అన్నారు.

# బిజినెస్ BUSINESS

## ఐఫోన్ వినియోగదారుల కోసం వాట్సప్ డ్యూయల్ అకౌంట్ సదుపాయం




మెటాకు చెందిన మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సప్, పలు కొత్త ఫీచర్లను శుక్రవారం ప్రకటించింది. ఇకపై ఐఫోన్ వినియోగదారులు ఒక ఫోన్‌లో, ఒకేసారి రెండు వాట్సప్ ఖాతాలు నిర్వహించుకోవచ్చు. దీంతో పాటు ఫోటో ఎడిటింగ్, మెసేజ్ డ్రాఫ్టింగ్ కోసం కొత్త కృత్రిమ మేధ (ఏఐ) టూల్స్‌నూ సంస్థ తీసుకొచ్చింది. ఇప్పటివరకు ఆండ్రాయిడ్ మొబైల్ వినియోగదారులకే 'టూ అకౌంట్స్, వన్ ఫోన్' ఫీచర్ అందుబాటులో ఉండగా.. ఇప్పుడు ఐఓఎస్ ప్లాట్‌ఫాం పైనా అందుబాటులోకి రానుంది. వ్యక్తిగత, వృత్తిపర సంభాషణలను నిర్వహించడానికి వినియోగదారులు రెండు వేర్వేరు ఫోన్లు వినియోగించాల్సిన అవసరం ఇకపై ఉండదని వాట్సప్ తమ బ్లాగ్‌లో పేర్కొంది. యాప్ కింద భాగంలో కనిపించే ప్రొఫైల్ పిక్చర్ ద్వారా ప్రస్తుతం ఏ ఖాతా యాక్టివ్‌గా ఉందో వినియోగదారులు గుర్తించొచ్చు. జనరేటివ్ ఏఐ ట్రెండ్‌కు అనుగుణంగా, వాట్సప్ నేరుగా చాట్‌లలో 'మెటా ఏఐ'ను అనుసంధానిస్తోంది. వినియోగదారులు ఇకపై మెటా ఏఐ ఉపయోగించి ఫోటోలను టచ్‌అప్ చేయడం, అనవసరమైన అంశాలను తొలగించడం, బ్యాక్‌గ్రౌండ్ మార్చడం లేదా ఫోటో పంపే ముందు వివిధ స్టైల్స్ వాడటం వంటివి చేయొచ్చు. సంభాషణ సందర్భాన్ని బట్టి సమాధానాలను 'ఏఐ రైటింగ్ హెల్ప్' ఫీచర్ సూచిస్తుంది. ఏఐ టూల్స్ వల్ల భద్రతాపరమైన ఆందోళనలు తలెత్తవని, వినియోగదారుల చాట్‌లు పూర్తి 'ప్రైవేట్'గా ఉంటాయని వాట్సప్ స్పష్టం చేసింది. మెటా ఏఐ కొత్త ఫీచర్లు వినియోగదారులందరికీ వెంటనే అందుబాటులోకి రాకపోవచ్చని కంపెనీ తెలిపింది.

## విద్యుత్ బైక్‌ల సబ్సిడీ పొడిగింపు



విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా తీసుకొచ్చిన పీఎం ఇడ్రైవ్ పథకంపై కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఎలక్ట్రిక్ టూ వీలర్ సబ్సిడీలను జులై 31 వరకు పొడిగించినట్లు తెలిపింది. అదేవిధంగా ఇరిక్షా, ఇకార్టుల వాహనాల సబ్సిడీలను 2028 మార్చి 31వరకు పొడిగించినట్లు కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడించారు. పీఎం ఇడ్రైవ్ పథకాన్ని 2024 అక్టోబర్ 1న ప్రారంభించారు. ఎలక్ట్రిక్ టూ వీలర్లు, త్రీవీలర్లు, ఇ అంబులెన్సులు, ఇట్రక్కులకు కేంద్రం రాయితీ ఇస్తోంది. ఇందులో భాగంగా 1.4 మిలియన్ల ఎలక్ట్రిక్ టూవీలర్లను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకోగా, 2.48 మిలియన్ల వాహనాలు విక్రయించినట్లు కేంద్రం తెలిపింది. ఇందుకోసం సబ్సిడీ కింద రూ.1772 కోట్ల నిధులను కేటాయించగా, రూ.1,259.91 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొంది. ఇరిక్షా, ఇకార్టులకు సంబంధించి 36, 462 యూనిట్లను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకోగా, 39,034 యూనిట్లు అమ్మకాలు జరిగినట్లు తెలిపింది. ఇప్పటివరకూ ఎలక్ట్రిక్ 2 వీలర్ కేటగిరిలో సుమారు 1 మిలియన్ వాహనాలు విక్రయించినట్లు కేంద్రం అంచనా వేసింది. ఎలక్ట్రిక్ త్రీవీలర్ల విభాగంలో లక్ష్యాన్ని మించి 1,62,981 యూనిట్ల వాహనాలు అమ్మకాలు జరిగినట్లు తెలిపింది. కాగా, ఇరిక్షా, ఇకార్ట్ విభాగంలో ఆశించిన మేర విక్రయాలు జరగనందున, ఆ విభాగాల్లో నిధుల కేటాయింపును రూ. 192 కోట్ల నుంచి రూ.50 కోట్లకు తగ్గించడం గమనార్హం.

## సైబర్ దాడులతో పౌరుల ప్రాణాలకు ప్రత్యక్ష ముప్పు..!



ఆరోగ్య సంరక్షణ, పవర్ గ్రిడ్‌ల వంటి కీలక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకొని ఇటీవల సైబర్ దాడులు పెరుగుతున్న విషయం తెలిసిందే. అయితే, అవి కేవలం డేటా తస్కరణకు మాత్రమే పరిమితం కాలేదని, మానవుల ప్రాణాలకు ప్రత్యక్ష ముప్పు కలిగించే స్థాయికి చేరుకున్నాయని సైబర్ సెక్యూరిటీ నిపుణులు చెబుతున్నారు. దేశంలో డిజిటల్ పురోగతి అనే అంశంపై డెలాయిట్ ప్రతినిధి గౌరవ్ శుక్లా మాట్లాడుతూ.. సరికొత్త సాంకేతికతలు ఈ దాడుల అవకాశాలను మరింత పెంచాయన్నారు. తద్వారా విమానయానం, రవాణా, ప్రజా సేవల రంగాలకు ముప్పుగా పరిణమించనున్నాయన్నారు. ''గత రెండేళ్లుగా, సైబర్ దాడులు కేవలం ఐటీ వ్యవస్థలకు మాత్రమే పరిమితం కాలేదని గమనించాం. పరిధి దాటి వ్యాపిస్తున్నాయి. కీలక మౌలిక సదుపాయాలను సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకుంటున్నారు. గత కొన్నేళ్లుగా డిజిటల్ సాంకేతికతలో వచ్చిన మార్పులు ఈ దాడుల విస్తృతిని మరింత పెంచాయి. దీంతో అంతరాయాలు కలిగే అవకాశాలు పెరుగుతున్నాయి. వీటి పరిధి డేటా భద్రత నుంచి మానవ భద్రత వైపు మారుతోందని స్పష్టమవుతోంది'' అని గౌరవ్ శుక్లా పేర్కొన్నారు. ప్రస్తుతం ఎనిమిది బిలియన్ల ప్రపంచ జనాభా 30 బిలియన్లకుపైగా ఐఓటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) సెన్సర్లు కలిగి ఉన్నట్లు అంచనా. ఓ వైద్య పరికరంపై సైబర్ దాడి జరిగి.. రోగి డేటాను మారిస్తే అది ప్రాణాంతకం కావచ్చు. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థలపై హ్యాకింగ్ జరిగితే దేశవ్యాప్తంగా విద్యుత్ అంతరాయాలకు దారితీయవచ్చు'' అని గౌరవ్ వెల్లడించారు. దేశంలో డిజిటల్ చెల్లింపులు పెరిగిన నేపథ్యంలో వీటిపై మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.

## మూసివేత వార్తల వేళ.. టెక్ ప్రియులకు వన్‌ప్లస్ గుడ్‌న్యూస్



చైనాకు చెందిన మొబైల్ తయారీ కంపెనీ వన్‌ప్లస్ టెక్ ప్రియులకు గుడ్‌న్యూస్ చెప్పింది. దేశంలో తమ సర్వీస్ నెట్‌వర్క్‌లను 50 శాతం విస్తరిస్తున్నామని ప్రకటించింది. ప్రస్తుతం ఉన్న 400 సర్వీస్ నెట్‌వర్క్‌లను 600కు పెంచుతున్నామని తెలిపింది. గ్లోబల్ మార్కెట్లలో కంపెనీ మూతపడుతోందన్న వదంతుల నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. సొంత బ్రాండ్‌గా మొదలైన వన్‌ప్లస్.. ఇతర కంపెనీల పోటీతో ఏటా తన ప్రాభవాన్ని కోల్పోతోంది. ఈ క్రమంలోనే మాతృ సంస్థ బీబీకే ఎలక్ట్రానిక్స్‌కు చెందిన మరో స్మార్ట్‌ఫోన్ కంపెనీ ఒప్పోకు సబ్‌బ్రాండ్‌గా అవతరించింది. కొన్నేళ్లుగా ఆ కంపెనీకి సబ్‌బ్రాండ్‌గా కొనసాగుతూనే ఫోన్లను లాంచ్ చేస్తోంది. అయితే, మార్కెట్ వాటా క్రమంగా క్షీణిస్తుండటంతో వన్‌ప్లస్‌ను మూసివేస్తున్నారంటూ ప్రచారం జరుగుతోంది. తాజాగా వన్‌ప్లస్ సీఈఓ రాబిన్ లియు రాజీనామా చేయడంతో ఈ ప్రచారం మరింత బలపడింది. కాగా, ఈ వదంతులను కంపెనీ తోసిపుచ్చింది. సర్వీస్ నెట్‌వర్క్‌ను పెంచడం ద్వారా భారత్‌లో తమ కార్యకలాపాలు కొనసాగుతాయని స్పష్టం చేసింది. వన్‌ప్లస్ తన సొంత సర్వీస్ సెంటర్లను నిర్మించడానికి బదులుగా ప్రస్తుతం ఉన్న ఒప్పో సెంటర్లనే వాడుకోనుంది. తద్వారా వినియోగదారులకు సులువుగా తమ సేవలు అందుతాయని తెలిపింది. పెంచిన డేటా సెంటర్ల సేవలు ఏప్రిల్ నుంచి అందుబాటులోకి వస్తాయని పేర్కొంది. ప్రధానంగా టైర్ 2, టైర్3 నగరాల్లో వీటిని విస్తరిస్తున్నామని చెప్పింది. అంతేకాకుండా ఏప్రిల్ 7న వన్‌ప్లస్ నార్డ్ 6ను భారత మార్కెట్లోకి విడుదల చేస్తామని కంపెనీ ధృవీకరించింది.

## బధిరుల జాతీయ టీ10 ఛాంపియన్‌షిప్ విజేతగా ఏపీ మహిళా జట్టు



ఆంధ్రప్రదేశ్ బధిర మహిళా క్రికెట్ జట్టు అద్భుతం చేసింది. ఏడో ఐడీసీఏ మహిళల టీ10 జాతీయ క్రికెట్ ఛాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకుంది. ఫైనల్‌లో ఢిల్లీని ఐదు పరుగుల తేడాతో ఆంధ్రప్రదేశ్ టీమ్ ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఏపీ 10 ఓవర్లకు 73/4 స్కోరు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఢిల్లీ 68 పరుగులకే పరిమితమైంది. ఏపీ విజయంలో కీలక పాత్ర పోషించిన కాంతమ్మకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు వరించాయి.

**బీసీసీఐ మద్దతుతో..**

అఖిల భారత బధిర క్రికెట్ అసోసియేషన్ (IDCA)కు బీసీసీఐ నుంచి సహకారం లభిస్తోంది. అంతర్జాతీయ డెఫ్ క్రికెట్ కౌన్సిల్, ఆసియా డెఫ్ క్రికెట్ అసోసియేషన్ నుంచి కూడా ఐడీసీఏకి గుర్తింపు ఉంది. ఐడీసీఏ అధ్యక్షుడు సుమిత్ జైన్ మాట్లాడుతూ.. ''గత కొన్నేళ్లుగా అద్భుతమైన నైపుణ్యం కలిగిన క్రికెటర్లు వెలుగులోకి వస్తున్నారు'' అని ప్రశంసించారు.




## గంభీర్ పేరు, ఫొటోలు వాడొద్దు

**: ఢిల్లీ హైకోర్టు**



తన గుర్తింపు దుర్వినియోగానికి సంబంధించిన కేసులో టీమ్‌ఇండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌కు ఢిల్లీ హైకోర్టులో ఊరట లభించింది. గంభీర్ పేరు, ఫొటో, వాయిస్ లేదా ఏఐ జనరేటెడ్‌తో కూడిన వీడియోలను 36 గంటల్లో తొలగించాలని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ జ్యోతి సింగ్ ధర్మాసనం తీర్పునిచ్చింది. గంభీర్ తరఫున న్యాయవాదులు పలు సోషల్ మీడియా ఖాతాలను కోర్టు ముందుంచారు. ఆన్‌లైన్‌లో గంభీర్ గుర్తింపును దుర్వినియోగం చేసినట్లు వాదనలు వినిపించారు.

**తొలగించాల్సిందే..**

గంభీర్ తరఫు వాదనలు విన్న న్యాయస్థానం ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌తోపాటు ఇతర సోషల్ మీడియా ఖాతాల్లోని కంటెంట్‌ను 36 గంటల్లోనే తొలగించాలని స్పష్టం చేసింది. ముమ్ముందు ఇలాంటి అవాంఛిత కంటెంట్ ఆయా ఖాతాల్లో రాకుండా చూడాలని హెచ్చరించింది. ఉల్లంఘనకు పాల్పడిన బాధ్యుల వివరాలను వెల్లడించాలని ఆదేశించింది. భారత ప్రధాన కోచ్‌గా ఉన్న గౌతమ్ గంభీర్ తన వ్యక్తిగత జీవితాన్ని ఆస్వాదించే హక్కును కాలరాయడం తగదని హైకోర్టు పేర్కొంది.

## ఈ ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్‌కు గుర్తుండిపోయే రాత్రి అవుతుంది: అశ్విన్



బౌండరీ హద్దులపరంగా చిన్నస్వామి స్టేడియం చిన్నదే. ఐపీఎల్ 2026 సీజన్ తొలి మ్యాచ్‌కు అదే ఆతిథ్యం ఇస్తోంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో హార్డ్ హిట్టర్లకు కొదవేంలేదు. అయితే, ఈ మ్యాచ్‌లో మాత్రం సన్‌రైజర్స్ తరఫున హెన్రిచ్ క్లాసెన్, ఆర్సీబీకి జాకబ్ బెతెల్ ఆటే హైలైట్‌గా నిలుస్తుందని మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ అంచనా వేశాడు. ''ఈ మ్యాచ్ కోసం నేను ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. గత 18 నెలల కాలంలో హెన్రిచ్ క్లాసెన్ అద్భుతాలేమీ చేయలేదు. అందుకే, ఈ మ్యాచ్‌లో క్లాసెన్ ఎలా ఆడతాడనేది ఆసక్తికరంగా మారింది. తప్పకుండా ఇది గుర్తుండిపోయే రాత్రిగా మిగులుతుందని భావిస్తున్నా. ఎందుకో మాత్రం చెప్పలేకపోతున్నా. ఇక ఆర్సీబీ నుంచి జాకబ్ బెతెల్ పవర్ ప్లేయర్ ఆఫ్ ది డేగా నిలుస్తాడనేది నా అభిప్రాయం. హేజిల్‌వుడ్ లేకుండా ఆర్సీబీ బరిలోకి దిగుతోంది'' అని అశ్విన్ తెలిపాడు. అంతర్జాతీయ టీ20 క్రికెట్ నుంచి వీడ్కోలు పలికిన తర్వాత దక్షిణాఫ్రికా బ్యాటర్ క్లాసెన్ ఆటలో నిలకడ లోపించింది. 2024 టీ20 ప్రపంచ కప్ తర్వాత వివిధ లీగుల్లో క్లాసెన్ 65 మ్యాచులు ఆడాడు. అందులో 59 ఇన్నింగ్స్‌లకుగాను 1,440 పరుగులు చేశాడు. అతడి యావరేజీ కేవలం 28.80 మాత్రమే కావడం గమనార్హం. ఇందులో ఒక సెంచరీ, ఏడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. గత ఎస్ఏ20 సీజన్‌లోనూ నిరాశపరిచాడు. ఏడు ఇన్నింగ్స్‌ల్లో 138 పరుగులు మాత్రమే చేశాడు. అతడి బెస్ట్ స్కోరు కేవలం 29 పరుగులే. మరోవైపు ఇంగ్లాండ్‌కు చెందిన జాకబ్ బెతెల్ మాత్రం దూకుడు మీదున్నాడు. గత పొట్టి కప్‌లో 280 పరుగులు చేసిన అతడు ఇంగ్లాండ్ తరఫున టాప్ స్కోరర్. భారత్‌పై వాంఖడే వేదికగా జరిగిన సెమీస్‌లో సెంచరీ కూడా చేశాడు.

## సన్‌రైజర్స్ చరిత్రలో యంగెస్ట్ కెప్టెన్‌గా ఇషాన్ కిషన్



ఐపీఎల్ 2026 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడేందుకు సిద్ధమైంది. ఇషాన్ కిషన్‌కు సన్‌రైజర్స్ కెప్టెన్సీ అప్పగించింది. రెగ్యులర్ సారథి పాట్ కమిన్స్ జట్టుతోపాటు కలిసినప్పటికీ.. కొన్ని మ్యాచులకు దూరం అవుతాడని ఇప్పటికే ఎస్ఆర్‌హెచ్ వర్గాలు తెలిపాయి. దీంతో ఆర్సీబీతో మ్యాచ్‌కు ఇషాన్ నాయకత్వం వహిస్తాడు. ఈ క్రమంలో ఓ అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలో సన్‌రైజర్స్‌కు అతిపిన్న వయసులో సారథ్యం చేపట్టిన భారత ఆటగాడిగా నిలిచాడు. ఇంతకుముందు శిఖర్ ధావన్, మనీశ్ పాండే, భువనేశ్వర్ కుమార్ నాయకత్వం వహించినా.. వారంతా ఇషాన్ కంటే పెద్దవారే. ఇవాళ్టికి ఇషాన్ వయసు 27 ఏళ్ల 253 రోజులు. సన్‌రైజర్స్ చరిత్రలో ఓవరాల్‌గా రెండో పిన్న వయస్కుడు కావడం గమనార్హం. 2018వ సీజన్‌లో కేన్ విలియమ్సన్ 27 ఏళ్ల 244 రోజుల వయసులో ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్సీని అందుకొన్నాడు.

# 'పుష్ప' చిత్రాల రికార్డును బద్దలుకొట్టిన 'ధురంధర్'

బాక్సాఫీస్ వద్ద 'ధురంధర్2' వసూళ్ల పరంపర కొనసాగుతోంది. ఇప్పటివరకూ ఈ మూవీ రూ.1,128 కోట్లు (గ్రాస్) వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. 9వ రోజు హిందీ వెర్షన్ రూ.41.55 కోట్లు వసూలు చేయగా, తెలుగులో రూ.2.85 కోట్లు రాబట్టింది. తమిళనాడులో మాత్రం పెద్దగా ప్రభావం చూపించటం లేదు. దేశవ్యాప్తంగా మొత్తం 18,456 షోలు పడ్డాయి. ఈ క్రమంలో ఇప్పటికే వివిధ చిత్రాలు నెలకొల్పిన రికార్డులను ఈ మూవీ బద్దలు కొడుతోంది.

*** 'పుష్ప' సినిమాల రికార్డు అధిగమించి..**

'ధురంధర్' ఫ్రాంఛైజీ బాక్సాఫీస్‌కు సరికొత్త లెక్కలు నేర్పుతోంది. రెండు సినిమాలు కలిపి 'దంగల్', 'బాహుబలి', 'పుష్ప' చిత్రాల జీవితకాల కలెక్షన్లను దాటేశాయి. అదే 'బాహుబలి2' (రూ.1,810 కోట్లు), 'పుష్ప2'(రూ.1,800 కోట్లు) చిత్రాలతో పోలిస్తే, 'ధురంధర్: ది రివెంజ్' ఇంకా వెనుకబడే ఉంది. అయితే, విడుదలై పది రోజులే కావడంతో ఆ రికార్డులను అధిగమించడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ సినిమాగా 'దంగల్' (రూ.2,024 కోట్లు) రికార్డు ఇప్పటికీ పదిలంగానే ఉంది.

*** లెక్కలు వేగంగా మారకపోవడానికి కారణమదేనా?**

బాక్సాఫీస్ వద్ద 'ధురంధర్2' మంచి



వసూళ్లు రాబడుతున్నా, గత చిత్రాలతో పోలిస్తే, ఇంకా వెనుకబడి ఉంటానికి కారణాలు చాలానే ఉన్నాయి. 'పార్ట్1' కేవలం హిందీలో మాత్రమే విడుదల చేశారు. ప్రాంతీయ భాషల్లో విడుదల చేయకపోవడం ఆ చిత్రానికి కాస్త మైనస్. అయితే, 'పార్ట్2' విషయంలో ఆ తప్పు చేయకుండా ఆదిత్యధర్ అండ్ టీమ్ ముందు నుంచే జాగ్రత్త పడింది. అయినా కూడా సెన్సార్, సాంకేతిక సమస్యల కారణంగా తెలుగు, తమిళ ప్రీమియర్స్ రెండు రోజుల పాటు ప్రదర్శనకు నోచుకోలేదు. ఇది వసూళ్లపై కాస్త ప్రభావం చూపించిందనే చెప్పాలి. ఇక మరోవైపు బాక్సాఫీస్ వద్ద రూ.1800 కోట్లు సాధించిన చిత్రాలు ఏదో ఒకరకంగా టికెట్ ధరలు పెంచుకుని విడుదలైనవే. 'పుష్ప2' ప్రీమియర్ టికెట్ రూ.1000కు విక్రయించారు. ఆ తర్వాత వారం, పదిరోజుల పాటు అధిక ధరకు టికెట్లు విక్రయించారు. కానీ, 'ధురంధర్2' టికెట్ ధరల పెంపు లేకుండానే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మల్టీప్లెక్స్‌లు, సింగిల్ స్క్రీన్ ఏవీ కూడా టికెట్ ధరను పెంచలేదు. అయినా కూడా 9 రోజుల్లో రూ.1,100 కోట్లు వసూలు చేసింది.

## రూ.10 లక్షల రెమ్యునరేషన్..

### రూ.50వేలకు ఓకే చెప్పిన ఇళయరాజా



మలయాళ అగ్రకథానాయకుడు మమ్ముట్టి నటించిన క్లాసిక్ హారర్ చిత్రం 'అధర్వం'. 1989లో విడుదలైంది. డెన్నిస్ జోసెఫ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాకు పాటలు హైలైట్‌గా నిలిచాయి. అయితే ఈ సినిమాకు సంగీతం అందించిన లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఇళయరాజా మమ్ముట్టిపై ఉన్న గౌరవంతో తన రెమ్యూనరేషన్‌ను ఊహించని విధంగా తగ్గించుకోవడం అప్పట్లో సంచలనం సృష్టించింది. తాజాగా దానికి గల కారణాన్ని ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దర్శకుడు పంచుకున్నారు. సాధారణంగా ఆ సమయంలో ఇళయరాజా ఒక సినిమాకు దాదాపు రూ.10 లక్షల వరకు ఫీజు తీసుకునేవారు. 'అధర్వం' సినిమా మొత్తం బడ్జెట్ కేవలం రూ.22 లక్షలు మాత్రమే అని తెలుసుకున్న ఆయన చిత్ర నిర్మాతల పరిస్థితిని అర్థం చేసుకున్నారు. డెన్నిస్, మమ్ముట్టిల 'న్యూఢిల్లీ' సినిమా అంటే ఇళయరాజాకు ఉన్న ప్రత్యేక అభిమానం కారణంగా తన ఫీజును కేవలం రూ.50,000కు తగ్గించుకుని ఈ ప్రాజెక్ట్‌కు పనిచేశారు. ''నేను ఇళయరాజాకు ఫోన్ చేసి మాట్లాడాను. అప్పటి వరకూ నేను తీసిన సినిమాలేంటో తెలుసుకున్నారు. 'న్యూఢిల్లీ' అంటే ఇష్టమని చెప్పారు. ఆయన్ని కలవగానే 'ప్రస్తుతం ఒక్కో సినిమాకు ఎంత రెమ్యునరేషన్ తీసుకుంటున్నానో తెలుసా మీకు? మీరు నాకు ఎంత ఇస్తారు' అని ఇళయరాజా నన్ను అడిగారు. నేను అంత ఇవ్వలేనని రూ.50వేలు మాత్రమే ఇవ్వగలనని చెప్పా. నా నిజాయతీకి నచ్చి ఆయన వెంటనే ఓకే అన్నారు. మేము ఆయనకు సిల్క్ స్మిత పాట కోసం ఒక రిఫరెన్స్ ఇచ్చాము. అది విన్న వెంటనే ఆయన 'పుళయోరత్తిల్' అనే ట్యూన్ హమ్ చేశారు. అలానే 30 నిమిషాల్లోనే మిగిలిన మూడు పాటలను కూడా కంపోజ్ చేశారు'' అని దర్శకుడు డెన్నిస్ చెప్పారు.

## 'పెద్ది' కోసం 'లెనిన్' వాయిదా..

### విడుదల ఎప్పుడంటే?



అఖిల్ అక్కినేని కథానాయకుడిగా నటించిన 'లెనిన్' చిత్రం వాయిదా పడింది. తొలుత అనుకున్న షెడ్యూల్ ప్రకారం మే 1న ఈ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నట్లు ప్రకటించారు. తాజాగా జూన్ 26వ తేదీకి వాయిదా వేశారు. బుచ్చిబాబు దర్శకత్వంలో స్టార్ హీరో రామ్‌చరణ్ నటిస్తున్న 'పెద్ది' ఏప్రిల్ 30న విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో 'లెనిన్'ను వాయిదా వేస్తూ చిత్ర బృందం నిర్ణయం తీసుకుంది. పరస్పర గౌరవంతో పాటు, ఎక్కువ సంఖ్యలో థియేటర్ల లభ్యత, సానుకూల వాతావరణాన్ని కల్పించేందుకు, ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో బలమైన భావోద్వేగాలు, ఆకట్టుకునే కథనంతో 'లెనిన్'ను తీర్చిదిద్దుతున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. తమన్‌సంగీతం అందిస్తున్నారు. మనం ఎంటర్‌ప్రైజెస్ LLP, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు.

## 'జననాయగన్' మరింత ఆలస్యం.. జులైలోనేనా!

విజయ్ నటించిన 'జన నాయగన్' విడుదలపై ఇంకా సందిగ్ధత నెలకొనే ఉంది. తాజా నివేదికల ప్రకారం ఈ సినిమా విడుదల మరింత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. 2026 ప్రారంభంలోనే దీన్ని విడుదల చేయాలని భావించినప్పటికీ సెన్సార్ బోర్డ్ పరంగా ఎదురైన అడ్డంకుల వల్ల ఇది వాయిదా పడింది. విజయ్ పుట్టినరోజున దీన్ని రిలీజ్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. జూన్ 22న ఈ హీరో పుట్టినరోజు కావడంతో జూన్ 18న దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావించారు. తాజాగా ఈ తేదీకి కూడా జననాయగన్ రావడం కష్టమే అని తెలుస్తోంది. ఈ చిత్రాన్ని నిర్మించిన కేవీఎన్ ప్రొడక్షన్స్ చేతిలో ప్రస్తుతం భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటిలో యశ్ నటిస్తోన్న 'టాక్సిక్' ఒకటి. ఈ చిత్రం జూన్‌లో విడుదల కానుంది. దీంతో జులైలో 'జననాయగన్'ను రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నారట.

సినిమా

# రెండు భాగాలుగా వారణాసి?



సూపర్ స్టార్ మహేశ్ బాబు, ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్ లో రాబోతున్న చిత్రం వారణాసి. ప్రస్తుతం ఈ సినిమాపై ఓ గాసిప్ నడుస్తోంది. ఈ సినిమా ఇప్పుడు రెండు భాగాలుగా విడుదలయ్యే అవకాశం ఉందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవల విడుదలైన ధురందర్, ధురందర్ 2 చిత్రాలు సాధించిన అఖండ విజయం రాజమౌళి ఆలోచనా విధానాన్ని మార్చినట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. ఈ మెగా స్టోరీని కేవలం మూడు గంటల్లో చెబితే న్యాయం జరగదని, అందుకే సినిమాను రెండు భాగాలుగా తీసుకురావాలని నిర్మాతలు తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు పలు నివేదికలు చెబుతున్నాయి. రాజమౌళి కూడా తన కథను ఎలాంటి తొందరపాటు లేకుండా విడతల వారీగా వెండితెరపైకి తేవాలని భావిస్తున్నట్లు పలువురు భావిస్తున్నారు. అయితే, ఈ వార్తలను రాజమౌళి గతంలోనే ఖండించడం గమనార్హం. గత నెలలో ఓ అంతర్జాతీయ మీడియాతో రాజమౌళి మాట్లాడుతూ.. వారణాసికి సీక్వెల్స్ ఉండవని, ఇది ఒకే భాగంగా వస్తుందని స్పష్టం చేశారు. ఇది మూడు గంటలకు పైగా నిడివి ఉండే ఒకే చిత్రంగా ఉంటుందని చెప్పారు.



## కోల్డ్ వార్ బరస్ట్

కన్నడ స్టార్ హీరో రిషబ్ శెట్టి ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాడు. కాంతార: చాప్టర్ 1తో హిట్ ను సొంతం చేసుకున్న ఆయన తాజాగా తన సహనటీనటులను ఇన్‌స్టాలో అన్ఫాలో చేయడం కన్నడ పరిశ్రమలో చర్చకు దారితీసింది. రాజ్ బి శెట్టి, నటి రుక్మిణి వసంత్‌లతో పాటు కాంతార వంటి భారీ చిత్రాన్ని నిర్మించిన ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ అధికారిక ఖాతాను కూడా ఆయన అన్ ఫాలో చేశాడు. దీంతో కొన్ని రోజులుగా కాంతార టీమ్‌లో విభేదాలున్నాయంటూ వస్తోన్న వార్తలకు మరింత బలం చేకూరింది. నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్‌ను ఆయన అన్‌ఫాలో చేసినప్పటికీ.. ఆ సంస్థ అధినేత విజయ్ కిరగందూర్‌ను మాత్రం ఇంకా ఫాలో అవుతూనే ఉన్నాడు. మరోవైపు రిషబ్ తన తదుపరి భారీ ప్రాజెక్ట్ జై హనుమాన్ కోసం సిద్ధమవుతున్నాడు. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో ఆయన హనుమంతుడి పాత్రలో కనిపిస్తారని ఇప్పటికే ప్రకటించారు.

## సిల్కు చీరలో వైష్ణవి

బేబీ సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న నటి వైష్ణవి చైతన్య మరోసారి తన అందం, స్టైల్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. సిల్కు చీరలో మెరిసిపోయింది. ఆధునిక ఫ్యాషన్ టచ్‌తో ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఆమె ప్రెజెన్స్‌లో కనిపించిన గ్రేస్, ఎక్స్‌ప్రెషన్స్‌లో ఉన్న నేచురల్ ఫ్లో ఈ లుక్‌ను మరింత ఎలివేట్ చేశాయి. అతిగా మేకప్ లేకుండా, సున్నితమైన టచ్‌తో చేసిన మేకప్ ఆమె నేచురల్ బ్యూటీని హైలైట్ చేసింది. హెయిర్ స్టైలింగ్ కూడా చాలా సాఫ్ట్‌గా ఉండటం వల్ల మొత్తం లుక్‌కు క్లాసిక్ ఫీల్ వచ్చింది. ఆభరణాలు కూడా ఎక్కువగా కాకుండా, చీరకు సరిపోయేలా సెలెక్ట్ చేయడం వల్ల ప్రతి ఎలిమెంట్ పరస్పరం బ్యాలెన్స్ అయింది. స్టైలిస్ట్ భార్గవి కునం, మేకప్ ఆర్టిస్ట్ శివ, హెయిర్ స్టైలిస్ట్ విక్కీ కలిసి ఈ లుక్‌ను ఎంతో ఎలిగెంట్‌గా తీర్చిదిద్దారు. ఈ ఫోటోషూట్ వైష్ణవి చైతన్యలో ఉన్న నేచురల్ చార్మ్, ఫ్యాషన్ సెన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌ను మరోసారి రుజువు చేసింది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.